జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఆదిలాబాద్
మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్
ఆదివారం 23 ఆగస్టు 2026 పేజీలు : 8



## రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి



విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం


డీజేఏల్పీ నేత ,స్థానిక శాసన సభ్యులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

6

# తెర ముందు ఎవరు.. తెర వెనుక ఎవరు?

**ఆసిఫాబాద్ ఆర్సీ (ప్రజాజ్యోతి): ఆగస్టు 22** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం సరండి గ్రామపంచాయతీలో ఇటీవల నిర్వహించిన గ్రామ సభ వ్యవహారం ఇంకా చర్చనీయాంశంగానే కొనసాగుతోంది. గ్రామ ప్రజల సమస్యలు, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై చర్చ జరగాల్సిన గ్రామ సభలో మీడియా అంశం ప్రస్తావనకు రావడంతో పాటు, ఆ తర్వాత చోటుచేసుకుంటున్న పరిణామాలు స్థానికంగా రాజకీయ చర్చకు దారితీస్తున్నాయి. నార్లాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి గ్రామ సభలో మీడియాను ప్రస్తావిస్తూ చేసిన వ్యాఖ్యలపై కొందరు స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. సాధారణంగా గ్రామ సభ అంటే ప్రజలు తమ సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లే వేదిక. అలాంటి సమావేశంలో మీడియా పాత్రపై చర్చకు రావడం వెనుక కారణమేంటనే ప్రశ్నలు ఇప్పుడు వినిపిస్తున్నాయి.

3




గ్రామ సభ వ్యవహారం ఇంకా చర్చనీయాంశంగానే కొనసాగుతోంది. గ్రామ ప్రజల సమస్యలు, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై చర్చ జరగాల్సిన గ్రామ సభలో మీడియా అంశం ప్రస్తావనకు రావడంతో పాటు, ఆ తర్వాత చోటుచేసుకుంటున్న పరిణామాలు స్థానికంగా రాజకీయ చర్చకు దారితీస్తున్నాయి.



# చార్జిషీట్ నుంచి తీర్పు వరకు టైమ్‌లైన్‌పై ప్రత్యేక దృష్టి

మంచి పని చేయండి.. టైమ్‌లైన్‌ను పాటించండి..

టీమ్‌వర్క్‌తోనే న్యాయపరమైన విజయాలు సాధించగలం

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా

18

# సమస్యలతో సతమతమవుతున్న ఆర్కే ఎన్‌టీ కార్మికులు

**ఉత్పత్తి టార్గెట్లపై ఉన్న శ్రద్ధ భద్రతపై ఎందుకు లేదు?**

**కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడొద్దు**

**ఏఐటీయూసీ నాయకులు**



**మంచిర్యాల, ఆగస్టు 22 (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే ఎన్‌టీ గనిలో కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ నాయకులు శనివారం ఆరోపించారు. కార్మికుల భద్రత, మౌలిక సదుపాయాలపై యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు తీవ్రంగా విమర్శించారు. శనివారం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, ఉపాధ్యక్షులు కొట్టే కిషన్‌రావు, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమరయ్య గనిని సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గనిలో కార్మికులకు అవసరమైన పనిముట్లు, రక్షణ పరికరాలు, తాగునీరు అందుబాటులో లేకపోవడంతో పాటు భూగర్భ గనిలో సరైన గాలి ప్రసరణ కూడా లేదని నాయకులు తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉత్పత్తి లక్ష్యాలను ఎలా సాధిస్తారని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ప్రత్యేకంగా గనిలోని 17వ ప్యానెల్‌లో 11, 12, 13, 14 లెవెల్స్‌లో సరైన గాలి ప్రసరణ లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భూగర్భ గనుల్లో గాలి ప్రసరణ కార్మికుల ప్రాణాలకు సంబంధించిన అత్యంత కీలకమైన భద్రతా అంశమని, అయినప్పటికీ సమస్యను పరిష్కరించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. ఉత్పత్తి టన్నుల లెక్కలపై ఉన్న శ్రద్ధ కార్మికుల ప్రాణాలపై ఎందుకు లేదని ప్రశ్నించారు. వెంటనే గాలి ప్రసరణ సమస్యను పరిష్కరించి సురక్షితమైన పని వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే అవసరమైన 43 ఎంఎం బొగ్గు డ్రిల్ బిట్స్, 27 ఎంఎం రూఫ్ బోల్ట్స్ అందుబాటులో లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరోవైపు సేఫ్టీ షూస్, హ్యాండ్ గ్లోవ్స్, సాక్స్, డ్రిల్ సబ్బుల్స్, హెల్మెట్లు వంటి రక్షణ పరికరాలను సకాలంలో అందించడం లేదని ఆరోపించారు. గనిలో డాగ్ నెయిల్స్ (కీలలు) ఉన్నప్పటికీ కొత్తవి ఇవ్వకుండా పాతవాటినే ఉపయోగించాలని సూచించడం భద్రతా ప్రమాణాలను విస్మరించడమేనన్నారు. కార్మికుల భద్రత విషయంలో రాజీపడితే ఏఐటీయూసీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. భూగర్భ గనిలో పనిచేసే కార్మికులకు కనీసం తాగునీరు కూడా అందించలేని పరిస్థితి నెలకొనడం యాజమాన్య నిర్లక్ష్యానికి పరాకాష్ట అని నాయకులు విమర్శించారు. కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా ఉత్పత్తి టార్గెట్ల పేరుతో ఒత్తిడి చేయడం సరికాదన్నారు. ఇదిలా ఉండగా యాజమాన్యానికి చెందిన కంప్రెషర్లు, డ్రిల్ రాడ్లను కాంట్రాక్టర్లు వినియోగించుకుంటున్నారని, కాంట్రాక్ట్ యంత్రాలతో పనులు చేసినట్లుగా బిల్లులు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు కార్మికుల నుంచి తమ దృష్టికి వచ్చాయని ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కంపెనీ వనరులను ఎవరు, ఏ ప్రాతిపదికన ఉపయోగిస్తున్నారు? వాటికి సంబంధించిన బిల్లులు ఏ విధంగా మంజూరు అవుతున్నాయి? అనే అంశాలపై యాజమాన్యం స్పష్టత ఇవ్వాలని కోరారు. కార్మికుల భద్రతను పక్కనపెట్టి కేవలం ఉత్పత్తి లక్ష్యాల కోసం పరుగులు పెట్టడం ఇకపై సాగనివ్వబోమని ఏఐటీయూసీ నాయకులు స్పష్టం చేశారు. గనిలో సరైన గాలి ప్రసరణ, తాగునీరు, అవసరమైన పనిముట్లు, నాణ్యమైన రక్షణ పరికరాలను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్మికుల చెమటతోనే సింగరేణి ఉత్పత్తి సాగుతుందని, కార్యాలయాల్లో కూర్చొని నిర్ణయించే టార్గెట్లతో కాదని ఘాటుగా వ్యాఖ్యానించారు. కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించకుండా నిర్లక్ష్యం కొనసాగిస్తే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మరింత ఉధృతమైన పోరాటం చేపడతామని యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జీఎం కమిటీ సభ్యుడు ఏ. సంపత్, పిట్ సెక్రటరీ ఆకుల లక్ష్మణ్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ సందీప్ కుమార్, చంద్రమౌళి, మల్లేష్, మధుకర్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# మల్లారెడ్డి జ్ఞాపకార్థం మొక్కలు నాటిన బీజేపీ నాయకులు



**మంచిర్యాల, ఆగస్టు 22 (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఇటీవల అకాల మరణం చెందిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు ముల్కల మల్లారెడ్డి జ్ఞాపకార్థం మొక్కలు నాటే కార్యక్రమాన్ని బీజేపీ సీనియర్ నాయకులు తుల మధుసూదన్ రావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు మున్నా రాజా సిసోడియా, తుల మధుసూదన్ రావు మాట్లాడుతూ.. ముల్కల మల్లారెడ్డి బీజేపీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, పార్టీ కష్టకాలంలో అండగా నిలిచి జిల్లాలో పార్టీని ముందుకు నడిపించారని అన్నారు. ప్రస్తుతం పార్టీ అధికారంలోకి రావడానికి అనుకూల పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఆయన లేకపోవడం పార్టీకి తీరని లోటని అన్నారు. మల్లారెడ్డి ఎన్నో విద్యాసంస్థలను స్థాపించి విద్యా వ్యవస్థకు వన్నెతెచ్చారని, మంచిర్యాల జిల్లాను విద్యాహబ్‌గా తీర్చిదిద్దడంలో ఆయన కృషి ఎంతో కీలకమని అన్నారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగానే జిల్లాలో అనేక కళాశాలలు అభివృద్ధి చెందాయని, వాటికి ఆయన వేసిన బీజమే కారణమని తెలిపారు . మల్లారెడ్డి భౌతికంగా లేకపోయినా ఆయన ఆలోచనలు, సేవలు సమాజంలో చిరకాలం నిలిచేలా ఆయన జ్ఞాపకార్థం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటినట్లు తెలిపారు. చావు, పుట్టుక మన చేతుల్లో లేనప్పటికీ.. ఆ రెండింటి మధ్య లభించిన జీవితాన్ని సమాజం కోసం ఎంతగా ఉపయోగించామన్నదే ముఖ్యమని, ఆ విషయంలో మల్లారెడ్డి జీవితం అందరికీ ఆదర్శప్రాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి కుటుంబ సభ్యులు ముల్కల శ్రేయ, మణిహాస్ రెడ్డితో పాటు బీజేపీ నాయకులు మున్నా రాజా సిసోడియా, తుల మధుసూదన్ రావు, బోయని హరికృష్ణ, ముల్కల తిరుపతిరెడ్డి, బానోతు దాస్య, విశ్వహిందూ పరిషత్ నాయకులు వేముల రమేష్, లగిశెట్టి కమలాకర్, సురేందర్ రెడ్డి, అనిల్, రమేష్ రెడ్డి, కరీం, తాజ్ ఖాన్, శ్రీధర్, శంకర్, కుమారస్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వీరభద్రీయ సంగం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



**మంచిర్యాల, ఆగస్టు 22 (ప్రజాజ్యోతి):** తెలంగాణ వీరభద్రీయ (వీరాముష్టి) సంగం మంచిర్యాల జిల్లా కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కేంద్ర కమిటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాన కార్యదర్శి చేవ్వా శ్రీనివాస్, కార్యదర్శి కడెం జంగయ్య, వైస్ చైర్మన్ పొన్నాల శివరాజ్, విద్యా కమిటీ చైర్మన్ కాటపల్లి విఠల్, జాతీయ కమిటీ మాజీ కోశాధికారి కాటపల్లి గండేస్వామి హాజరై నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా కడారి సాగర్తో పాటు పలువురు నూతన కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ తాండూర్ మండల ప్రధాన కార్యదర్శి బాణాల రాజు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. సంగం అభివృద్ధికి, వీరభద్రీయ సమాజ సంక్షేమానికి నూతన కార్యవర్గం కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. అనంతరం సంగం నాయకులు, సభ్యులు, అభిమానులు నూతన కమిటీకి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంగం నాయకులు, సభ్యులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఉట్నూర్ లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కు మార్ కు ఘన స్వాగతం పలికిన ఏఎంసి చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



**ఆదిలాబాద్ బ్యూరో,ఆగస్టు 22, (ప్రజా జ్యోతి )** ఉట్నూర్‌లోని ప్రభుత్వ గిరి జన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలలో నిర్వ హించిన ఏకరూప దుస్తులు, స్టూడెంట్ కిట్ల పంపిణీ కార్య క్రమాన్ని రాష్ట్ర గిరిజన సంక్షే మ, సాంఘిక సంక్షేమ దివ్యాంగుల సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వ చ్చిన మంత్రికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తో కలిసి ఆదిలాబాద్ వ్యవ సాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఘనంగా స్వాగ తం పలికారు.ఈ సందర్భంగా పాఠశాలకు వచ్చిన అతిధులకు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థినులకు ఏకరూప దుస్తులు (యూనిఫామ్స్) స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువు తున్న విద్యార్థులకు మెరు గైన వసతులు, నాణ్యమైన విద్యను అందించడమే కాం గ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయ మని నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. శ్రీ కాంత్ రెడ్డి వెంట డీసీసీ జనరల్ సెక్రటరీలు ధర్మపురి చంద్ర శేఖర్, మాల్యాల కరుణాకర్ ప్రజాప్రతినిధులు, కాం గ్రెస్ పార్టీ నాయకులు పాల్గొ న్నారు.

## మ్యాపింగ్ కాని ఓటర్లకు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

**కోమటిగూడ ఓటర్లకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మేంగాజి అవగాహన**



**ఆసిఫాబాద్ , ఆగస్టు 22 ప్రజా జ్యోతి** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని కొన్ని ఓటర్ల ఫామ్స్ తిరిగి వచ్చిన నేపథ్యంలో, అర్హులైన ఓటర్లకు ఓటు హక్కు కల్పించేందుకు బీఎల్ఏలు సహకరించాలని కాంగ్రెస్ పార్టీ వాంకిడి మండల అధ్యక్షుడు గురునూలే మేంగాజి కోరారు.వాంకిడి మండలంలోని అన్ని బూత్‌ల పరిధిలో మ్యాపింగ్ కాని ఓటర్లకు నివాస ధ్రువీకరణ పత్రం లేదా స్టడీ సర్టిఫికెట్ అందజేసి, సంబంధిత బీఎల్ఓలకు సహకరించాలని సూచించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా అవసరమైన పత్రాలను సమర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఓటర్లకు అవగాహన కల్పిస్తూ, బీఎల్ఓలు బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలని మేంగాజి పేర్కొన్నారు.

## పంట పొలాల మధ్య వేలా డుతూ ప్రమాదకరంగా విద్యుత్ తీగలు పట్టించుకోని అధికారులు



**కడెం, ఆగస్టు 22 (ప్రజా జ్యోతి)** నిలబడితే తాకే ఎత్తులో పంట పొలాల్లో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం ముం చుకొస్తుందో నని వైర్లను చూసి రైతులు, ప్రజలు భ యాందోళనకు గురి అవుతున్నారు. ప్రమాదం పొంచి ఉందని ఆంధోళన వ్యక్తం చేస్తున్నారు. కడెం మండలం లింగాపూర్ గ్రామంలోని సబ్‌స్టేషన్ వెనకాల వ్యవ సాయ పంట పొలాల్లో 11 కేవీ విద్యుత్ లైన్ తీగలు చేతికి అందే స్థాయిలో కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. దీంతో రైతన్నలు ఎప్పుడేం జరుగుతుం దోనని బిక్కుబిక్కుమంటూ పొలాల్లో వ్యవసాయ పను లు చేసుకుంటున్నారు. వేలాడుతున్న విద్యుత్ వైర్లకు మధ్యలో కర్రలు సపోర్టుగా పెట్టినా గాలిదూమరానికి పడిపోతున్నాయని వాపో తున్నారు. మాపొలాల్లో కలుపుతీత పనులకు కూడా కూలీలు రావడంలేదని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు సార్లు చెప్పి నా పట్టించు కోవడంలేదని అన్నారు. ఇప్పటికైనా సం బంధిత అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని ఉన్న స్థలం నుండి మార్పిడి చేసి, విద్యుత్ వైర్లను సరిచే యాలని రైతులు కోరుతున్నారు.

# పనిముట్ల కొరతపై ఎస్ఆర్పీ-3 కార్మికుల నిరసన

## ఏఐటీయూసీ నాయకత్వంలో యాజమాన్యాన్ని నిలదీసిన కార్మికులు

**మంచిర్యాల, ఆగస్టు 22 (ప్రజాజ్యోతి):** ఎస్ఆర్పీ-3 గనిలో కార్మికుల మౌలిక అవసరాలైన బిట్లు, బూట్లు, కీలలు తదితర పనిముట్లను సుమారు ఐదు నెలలుగా సరఫరా చేయడంలో యాజమాన్యం విఫలమైందని ఆరోపిస్తూ కార్మికులు శనివారం మొదటి బదిలీలో ఏఐటీయూసీ నాయకత్వంలో నిరసన వ్యక్తం చేశారు. పనిముట్ల కొరతపై అనేకసార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని కార్మికులు తెలిపారు. సేఫ్టీ కమిటీ, మైన్స్ కమిటీ సమావేశాల్లోనూ సంబంధిత అధికారులకు సమస్యను వివరించినట్లు పేర్కొన్నారు. అవసరమైన పనిముట్లు అందుబాటులో లేకపోవడం వల్ల విధులు నిర్వహించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా మ్యాన్ రైడింగ్ సక్రమంగా పనిచేయకపోవ డంతో ఉద్యోగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని తెలిపారు. దీంతో నిర్ణీత సమయానికి పని ప్రదేశాలకు చేరుకోలేక అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లడంలో జాప్యం జరుగుతోందన్నారు. ఫలితంగా ఉత్పత్తి లక్ష్యాల విషయంలో అధికారుల నుంచి కార్మికులపై ఒత్తిడి, హెచ్చరికలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.మ్యాన్ రైడింగ్ సమస్యపై స్థానిక యాజమాన్యాన్ని ప్రశ్నించగా, సాంకేతిక నిపుణులను ఇప్పటికే పిలిపించామని, ప్రస్తుతం జాగ్రత్తలతోనే మ్యాన్ రైడింగ్‌ను నడపాల్సి వస్తోందని



అధికారులు తెలిపినట్లు కార్మికులు తెలిపారు .పనిముట్ల కొరత, మ్యాన్ రైడింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు యాజమాన్యాన్ని నిలదీశారు. సమస్యలకు తక్షణ పరిష్కారం చూపకపోతే భవిష్యత్తులో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. పనిముట్ల కొరత కొనసాగితే సహాయ నిరాకరణకు సైతం వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ముస్కే సమ్మయ్య, పిట్ కార్యదర్శి మురళి చౌదరి, సహాయ కార్యదర్శులు అంబాల రవి, కారుకూరి నగేష్, షిఫ్ట్ ఇన్‌చార్జీలు ఆడెపు సురేష్, రాచర్ల రవీందర్, మైన్స్ కమిటీ, సేఫ్టీ కమిటీ సభ్యులు, పిట్ నాయకులు, ఎస్ఆర్పీ-3 కార్మికులు పాల్గొన్నారు.

# పేదల ఇళ్లతో చెలగాటమాడితే సహించేది లేదు

**నాసిరకం నిర్మాణంపై సమగ్ర విచారణ జరపాలి: గుర్నులే నారాయణ**

**నాసిరకం స్లాబ్‌ను తొలగించి కొత్త స్లాబ్ వేయాలి కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై కఠిన చర్యలు తీసుకోవాలిలబ్ధిదారురాలికి న్యాయం చేయాలి**

**ఆసిఫాబాద్ , ఆగస్టు 22 ప్రజా జ్యోతి** పేదల ఇళ్లతో చెలగాటమాడితే సహించేది లేదని వాంకిడి మండల మాజీ అధ్యక్షులు గుర్నులే నారా యణ హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాసిరకం పను లు చేపడితే కఠిన చర్యలు తప్పవని అన్నారు.కొమురంభీం ఆసిఫాబా ద్ జిల్లా వాంకిడి మండలం పాటగూడ పంచాయతీ పరిధిలో సో యం సోంబాయి ఇందిరమ్మ ఇంటి స్లాబ్ నాసిరకంగా నిర్మించారని ఆరోపించారు. స్లాబ్‌కు పగుళ్లు ఏర్పడి వర్షం పడినప్పుడు ఇంట్లోకి నీరు కారుతోందని లబ్ధిదారురాలు ఆవేదన వ్యక్తం చేయడంతో శనివారం ఆయన ఇంటిని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.

**పేదల కలతో ఆటలా?**

ఈ సందర్భంగా గుర్నులే నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను నెరవేర్చాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. పేదల కోసం ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతో నిర్మించే ఇళ్లలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే పాటగూడలో నిర్మిస్తున్న ఇంటి స్లాబ్ నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నా యని, నిర్మాణం పూర్తయిన కొద్దికాలానికే పగుళ్లు ఏర్పడి వర్షపు నీరు కారడం ఆందోళనకరమన్నారు. పేద కుటుంబాలు ఎంతో ఆశతో నిర్మించుకుంటున్న ఇంటిలో నాసిరకం పనులు చేయడం వల్ల తీవ్రంగా నష్టపోతారని, భవిష్యత్తులో వర్షాలు, తేమతో మరిన్ని సమస్యలు వస్తాయని పేర్కొన్నారు.

**నాసిరకం స్లాబ్ తొలగించి కొత్తది వేయాలి**

ప్రస్తుతం ఉన్న స్లాబ్‌ను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు సాంకే తికంగా పరిశీలించాలని, నాణ్యత లేదని తేలితే పగుళ్లకు పైపూతలు వేసి చేతులు దులుపుకోకుండా, పూర్తిగా తొలగించి నాణ్యతతో కూడిన కొత్త స్లాబ్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. కొత్త స్లాబ్‌కు అయ్యే అదనపు ఖర్చును లబ్ధిదారురాలిపై మోపవద్దని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే సమస్య వస్తే అతని నుంచే రికవరీ చేయాలని కోరారు.

**నాణ్యత పరీక్షలు చేయాలి**



ఇంటి నిర్మాణానికి ఉపయోగించిన సిమెంట్, ఇసుక, కంకర, ఇనుము తదితర సామగ్రి నాణ్యతను పరిశీలించాలని, నిబంధనలకు అనుగుణంగా మెటీరియల్ వాడారా లేదా అని తనిఖీ చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షించాల్సిన అధికారులు పునాది నుంచి గోడలు, స్లాబ్ వరకు ప్రతి దశలో తరచూ తనిఖీలు చేయాలని సూచించారు.

**కాంట్రాక్టర్‌పై చర్యలు తప్పవు**

పేదల ఇళ్ల నిర్మాణంలో నాసిరకం పనులు చేసే కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పథకం పేరుతో ప్రజాధనాన్ని వృథా చేయడం సరికాదని అన్నారు. నాసిరకం నిర్మాణానికి ఎవరు బాధ్యులైనా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన పర్యవేక్షణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

**లబ్ధిదారురాలికి పూర్తి న్యాయం చేయాలి**

పాటగూడలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారురాలు సోయం సోంబాయి పేద కుటుంబానికి చెందిన మహిళ అని, ఆమెపై మళ్లీ ఆర్థిక భారం పడకుండా చూడాలని, అధికారులు వెంటనే సాంకేతిక నివేదిక రూపొందించి ఇంటి నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని కోరారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని, మండలంలోని ఇతర ఇందిరమ్మ ఇళ్లలో ఇలాంటి లోపాలు లేకుండా ప్రత్యేక తనిఖీలు చేయాలని డిమాండ్ చేశారు.

# హామీలు అమలు చేయకుండా ఆటో కార్మికులను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

## ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం హామీని వెంటనే అమలు చేయాలి

## ఆటో కార్మికుల బందుకు మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు సంపూర్ణ మద్దతు

**మంచిర్యాల, ఆగస్టు 22 (ప్రజాజ్యోతి):** ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులను విస్మరిస్తోందని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు విమర్శించారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23వ తేదీ అర్ధరాత్రి నుంచి చేపట్టనున్న బందుకు ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఆటో ఐక్య కార్యాచరణ సమితి నాయకులు శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని నడిపెల్లి దివాకర్‌రావు నివాసానికి వెళ్లి ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఆటో కార్మికుల డిమాండ్లను విన్న దివాకర్‌రావు వెంటనే స్పందించి బందుకు తన మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా దివాకర్‌రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారం లోకి వచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందజేస్తామని స్పష్టంగా హామీ ఇచ్చిందని, ప్రభుత్వం అధికారం లోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్నా ఆ హామీని అమలు చేయకపోవడం బాధాకరమని అన్నారు. మరోవైపు ఆటో కార్మికులు తమ హక్కుల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే వారిపై కేసులు పెట్టడం సరికాదని దివాకర్‌రావు అన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలపై ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ నాయకులను ఆటో కార్మికులు



నిలదీయాలని సూచించారు. హక్కుల కోసం ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టినా ఎవరూ అధైర్యపడవద్దని, వారికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆటో కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు నిరంతరం పోరాడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సాయం అందించే హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 23వ తేదీ అర్ధరాత్రి నుంచి చేపట్టనున్న బందుకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు నడిపెల్లి దివాకర్‌రావు స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేసి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో ఐక్య కార్యాచరణ సమితి నాయకులు పాల్గొన్నారు.

## గోయగావ్‌లో దోమల నివారణకు చర్యలు

### 34 మందికి వైద్య పరీక్షలు.. ఇద్దరి నుంచి రక్త నమూనాల సేకరణ



**ఆసిఫాబాద్ , ఆగస్టు 22 ప్రజా జ్యోతి** బంబారా ఉపకేంద్రం పరిధిలోని గోయగావ్ గ్రామంలో వైద్యాధికారి డాక్టర్ వినయ్ ఆదే శాల మేరకు ఆరోగ్య సిబ్బంది శనివారం ఇంటింటా దోమల నివారణ చర్యలు చేపట్టారు. గ్రామంలోని ఇళ్లలో 5 శాతం దోమల మందును పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది మాట్లాడుతూ.. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పూలకుండీలు, కూలర్లు, పాత టైర్లు, టబ్బులు, ప్లాస్టిక్ డబ్బాలు, కొబ్బరి చిప్పల్లో నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, మెదడువాపు, బోదకాలు వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ప్రతి వారం కనీసం ఒక్కసారైనా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి 34 మందిని పరీక్షించారు. జ్వరంతో బాధపడుతున్న ఇద్దరి నుంచి రక్త నమూనాలను సేకరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి రవిదాస్, ఏఎన్ఎం సునంద, ఆశా కార్యకర్తలు కమల, సునీత పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే జీఓ 97ను రద్దు చేయాలి

### పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దు

### మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

**మంచిర్యాల, ఆగస్టు 22 (ప్రజాజ్యోతి):** పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు డిమాండ్ చేస్తు , పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం ఆటలాడవద్దని ఆయన స్పష్టం చేశారు. జీఓ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నస్పూర్ పట్టణంలోని సీసీసీ కార్నర్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. బీఆర్ఎస్వీ మంచిర్యాల నియోజకవర్గ అధ్యక్షుడు దగ్గుల మధుకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన సమస్యపై బీఆర్ఎస్వీ చేపట్టిన నిరసనకు మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నడిపెల్లి దివాకర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 97తో పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తు చిన్నాభిన్నమయ్యే ప్రమాదం ఉందన్నారు. గతంలో పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో చేరే అవకాశం ఉండేదని, జీఓ 97 ద్వారా ఇంజనీరింగ్ చేయాలనుకునే పాలిటెక్నిక్ విద్యార్థులు మళ్లీ ఇంటర్మీడియట్ చదవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. దీనివల్ల విద్యార్థుల విలువైన సమయం వృథా కావడంతో పాటు ఆర్థికంగా కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. డిప్లొమా విద్యార్థుల జీవితాలతో ఆడుకోకుండా ప్రభుత్వం వెంటనే జీఓ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పదో తరగతి అనంతరం పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించే అనేక కోర్సులను రద్దు చేసే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఆందోళనకరమని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్, నియోజకవర్గ అధ్యక్షుడు దగ్గుల మధుకుమార్ అన్నారు. జాతీయ విద్యా విధానానికి అనుకూలంగా జీఓ 97ను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బాధ్యత నుంచి తప్పించుకునేందుకే పాలిటెక్నిక్ విద్యను శక్తి పథకానికి అనుసంధానం చేసే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి గుర్తింపు తీసుకురావాలనే ఉద్దేశంతో పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేయాలని చూస్తోందని వారు ఆరోపించారు. స్కిల్ యూనివర్సిటీలో చదివిన విద్యార్థులకు ఆశించిన స్థాయిలో ఉద్యోగ అవకాశాలు లభించడం లేదని, దీంతో విద్యార్థులు అక్కడ చదవడానికి ఆసక్తి చూపడం లేదన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులను ఐటీఐ విద్యార్థుల మాదిరిగా పరిగణించవద్దని, వారి విద్యా ప్రమాణాలు, కోర్సుల ప్రత్యేకతను కాపాడాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు తమ సమస్యలపై ప్రశ్నిస్తే పోలీసులను ప్రయోగించి వారి గొంతులను నొక్కడం సరికాదన్నారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ మోడల్ పేరుతో ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలకు లబ్ధి చేకూరే విధంగా జీఓ 97ను తీసుకొచ్చారని ఆరోపించారు. ఇప్పటికే ఇంటర్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఇప్పుడు పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థపై కూడా ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటే విద్యార్థుల భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతింటుందని వారు హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే జీఓ 97ను ఉపసంహరించుకుని పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా చరిత్రలో బాగుపడలేదని నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. ఇటీవల విద్యార్థుల ఆగ్రహానికి గురైన జాతీయ నాయకులు రాజీనామా చేయాల్సి వచ్చిన



సందర్భాలను గుర్తుచేస్తూ, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వారి ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రికి విద్యార్థులపై ఏమాత్రం ప్రేమ, చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే జీఓ 97ను రద్దు చేసి పాలిటెక్నిక్ విద్యార్థులకు న్యాయం చేయాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు నక్క తిరుపతి, ఎర్రోళ్ల నరేష్, ఎండీ నాయబ్, శ్రీకాంత్, బీఆర్ఎస్వై నియోజకవర్గ అధ్యక్షుడు కాటం రాజుకుమార్, చెన్నూర్ నియోజకవర్గ యువ నాయకులు ఎస్‌డీ జాకీర్, గోగార్ల శివ, కందుల ప్రశాంత్, సాజిద్ (సజ్జు), నస్పూర్ పట్టణ అధ్యక్షుడు ఆకూరి సుబ్బన్న, వంగ తిరుపతి, మెరుగు పవన్, టీజీబీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ హైమద్, కార్పొరేటర్ గుమ్మడి శ్రీను, పానుగంటి శ్రీను, పొగాకు రమేష్‌తో పాటు పలువురు విద్యార్థులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఈవీ ఆటోల ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి

## ఆటో కార్మికుల నిరవధిక బంద్‌కు సీఐటీయూ సంపూర్ణ మద్దతు

## సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి హామీలు అమలు చేయాలి సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్

**మంచిర్యాల, ఆగస్టు 22 (ప్రజాజ్యోతి):** ఆర్టీసీ యాజమాన్యానికి ఈవీ ఆటోలను అందించాలనే ప్రతిపాదనను రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 23 అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న నిరవధిక బంద్‌కు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు, ఆటో జేఏసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణలో ఆర్టీసీ తర్వాత అత్యధికంగా ప్రజలకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నది ఆటో రంగమేనన్నారు. ప్రభుత్వాలపై ఆధారపడకుండా నిరుద్యోగులు అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసి స్వయం ఉపాధి పొందుతూ, పట్టణాలు, గ్రామాలు, మారుమూల ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నారని తెలిపారు. లక్షలాది మంది ఆటో రంగంపై ఆధారపడి తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని అన్నారు. ప్రజలకు నిత్యం రవాణా సౌకర్యం అందిస్తున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఆటో డ్రైవర్‌కు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పి రెండేళ్లు గడిచినా ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు. వెంటనే ఆ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని రంజిత్ కుమార్ కోరారు. ఆటో డ్రైవర్ ప్రమాదవశాత్తు మృతి చెందినా, ప్రమాదంలో గాయపడినా వారి కుటుంబాలకు ప్రభుత్వపరంగా తగిన సహాయం అందడం లేదన్నారు. ఆటో, క్యాబ్, లారీ, డీసీఎం తదితర మోటార్ రంగ కార్మికులందరికీ సంక్షేమ బోర్డు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం ఆర్థిక భారం లేకుండా సంక్షేమ బోర్డుకు నిధులు సమకూర్చుకునే అవకాశం ఉందన్నారు. కొత్తగా ఆటోలు, క్యాబ్‌లు, లారీలు, డీసీఎంలు తదితర వాహనాలు కొనుగోలు చేసే సమయంలో 2 శాతం సెస్సు వసూలు చేస్తే కోట్లాది రూపాయలు సమకూరుతాయని, అదేవిధంగా కార్మికుల నుంచి సభ్యత్వ రుసుము వసూలు చేసి పెద్ద సంఖ్యలో సభ్యులను నమోదు చేయడం ద్వారా బోర్డుకు నిధులు సమకూర్చవచ్చని తెలిపారు. ఈ



సంక్షేమ బోర్డు రవాణా రంగ కార్మికులందరికీ భరోసాగా నిలుస్తుందని, ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా ఓలా, ఊబర్, రాపిడో వంటి యాప్‌ల ద్వారా ఆటో, క్యాబ్ డ్రైవర్ల నుంచి యాప్ సంస్థలు ఇష్టానుసారంగా కమీషన్లు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. డ్రైవర్లపై కమీషన్ల భారం తగ్గించేందుకు ప్రభుత్వం స్వయంగా ప్రత్యేక యాప్‌ను తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ యాజమాన్యానికి ఈవీ ఆటోలను అందించాలనే ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని రంజిత్ కుమార్ తెలిపారు. ఈ ప్రతిపాదన అమలైతే ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆటో డ్రైవర్ల జీవనోపాధి మరింత దెబ్బతింటుందని అన్నారు. ఇప్పటికే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో వేలాది మంది ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయారని పేర్కొన్నారు. ఇప్పుడు ఆర్టీసీకి ప్రత్యేకంగా ఈవీ ఆటోలను ఏర్పాటు చేస్తే ఆటో రంగంపై మరింత ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీకి ఈవీ ఆటోలు అవసరమైతే ప్రస్తుతం ఆటో డ్రైవర్ల వద్ద ఉన్న ఈవీ ఆటోలను తీసుకుని ప్రజా రవాణాకు వినియోగించే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. కొత్తగా ఈవీ ఆటోలను ఆర్టీసీకి ఏర్పాటు చేసే ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం, సంక్షేమ బోర్డు ఏర్పాటు, పెండింగ్‌లో ఉన్న హామీల అమలు, ఈవీ ఆటోల ప్రతిపాదన ఉపసంహరణ తదితర డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 23 అర్ధరాత్రి నుంచి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లు చేపట్టనున్న నిరవధిక బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ బంద్‌కు కార్మికులు, ప్రజాస్వామికవాదులు, విద్యార్థులు యువత, ప్రజా సంఘాల నాయకులు, ఉద్యోగులు, ప్రజలు సంపూర్ణంగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ జేఏసీ నాయకులు, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఆటో కార్మికుల సమ్మెకు మంచిర్యాల ఎంఐఎం సంపూర్ణ మద్దతు

**మేనిఫెస్టోలో ఇచ్చిన రూ.12,000 హామీని ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలి ఎంఐఎం నాయకుడు సయ్యద్ అఫాన్**

**కార్మికుల సమస్యలను అసదుద్దీన్ ఒవైసీ దృష్టికి తీసుకెళ్తాం**

**మంచిర్యాల, ఆగస్టు 22 (ప్రజాజ్యోతి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23 అర్ధరాత్రి నుంచి ఆటో కార్మికులు చేపట్టనున్న బంద్‌కు మంచిర్యాల ఎంఐఎం పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆటో ఐక్య కార్యాచరణ సమితి నాయకులు ఎంఐఎం నాయకుడు సయ్యద్ అఫాన్‌ను కలిసి సమ్మెకు మద్దతు ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి సమ్మెకు తమ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఈ సందర్భంగా సయ్యద్ అఫాన్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్నా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12,000



ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీని ఇప్పటికీ అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంఐఎం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ దృష్టికి తీసుకెళ్లి, సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన వేలాది మంది యువకులు ఆటోలు నడుపుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ఆయా వర్గాల ప్రజలు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో ఐక్య కార్యాచరణ సమితి నాయకులు, ఎంఐఎం పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తహసీల్దార్ ఎదుట ఐదుగురి బైండోవర్



**జన్నారం, ఆగస్ట్22(ప్రజాజ్యోతి)** జన్నారం పోలీస్ స్టేషన్ పరిధి లోని సేవాదాస్ నగర్ చర్చి సమీపంలో మూడు రోజుల క్రితం పేకాట ఆడుతూ పట్టుబడిన ఐదుగురు వ్యక్తులను శనివారం రోజున తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్.ఐ గుర్రపు ఉదయ్ కిరణ్ తెలిపారు. పేకాట ఆడుతూ పట్టుబడ్డ జాదవ్ నూర్ సింగ్, జాడి ప్రదీప్ కుమార్, దుర్గం అనిల్, మొహమ్మద్ తబ్రేజ్, బొదాసు నర్సింహ లను తహశీల్దార్ బక్కయ్య సమక్షంలో బైండోవర్ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్.ఐ ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ జూదం, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడటం వల్ల వ్యక్తిగతంగా, కుటుంబపరంగా మరియు సామాజికంగా నష్టపోతారని తెలిపారు. ప్రజలు ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, జూదం లేదా పేకాటకు పాల్పడినట్లయితే సంబంధిత చట్టాల ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండి, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని కోరారు.

# మంత్రికి ఘన స్వాగతం పలికిన ఎస్సీ డిపార్ట్మెంట్ నేత దుర్గం శేఖర్



**ఆదిలాబాద్ బ్యూరో, ఆగష్టు 22, (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ కు శనివారం వచ్చిన గిరిజన, సాంఘిక సంక్షేమది వ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి ఎస్సీ డిపార్ట్‌మెంట్ స్టేట్ వైస్ చైర్మన్ దుర్గం శేఖర్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా దళితులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, వారి సంక్షేమం, హక్కులు, అభివృద్ధికి సంబంధించిన అంశాలపై మంత్రి దృష్టికి తీసు కెళ్లి, సమస్యల పరిష్కారం కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. జిల్లాలో దళిత వర్గాల అభ్యున్నతికి ప్ర భుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. దళితుల సమస్యలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సాను కూలంగా విని, ప్రతి అంశాన్ని పరిశీలించి సమస్యల పరిష్కారానికి తగిన చర్య లు తీసుకుంటామని, దళితుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దళితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీ సుకెళ్లి, వాటి పరిష్కారం కో సం నిరంతరం కృషి చేస్తా మని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా దళిత సంఘాల నాయకులు రాజన్న, నక్క రామ దాసు, భీంరావు, ఆదిలాబాద్ జిల్లా మీడియా కోఆర్డినే టర్ మేకల జితేందర్, ముక్కెర అశోక్ పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచనా విధానం పెంపొందుతుంది

**గణిత విజ్ఞాన మేళాను సందర్శించిన సురేఖ**

**ప్రేమ్ సాగర్ రావు సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్న శిశు మందిరాల విద్యా విధానం**

**విభాగ్ స్థాయిలో సరస్వతి శిశు మందిరాల గణిత విజ్ఞాన మేళకు విశేష స్పందన**

**ఆకట్టుకున్న గణిత విజ్ఞాన ప్రదర్శనలు**





**మంచిర్యాల, 22 ఆగస్టు (ప్రజాజ్యోతి):** సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే విధంగా చిన్ననాటి నుంచే విద్యార్థులను తీర్చిదిద్దుతున్న సరస్వతి శిశు మందిరాల విద్యా విధానం నేటి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేస్తుందని మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మంచిర్యాల మున్సిపల్ మేయర్ ధరణి మధుకర్ అన్నారు. మంచిర్యాల సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో విభాగ్ స్థాయిలో శనివారం నిర్వహించిన గణిత విజ్ఞాన మేళకు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. మంచిర్యాల నియోజకవర్గంలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 41వ డివిజన్‌లో శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన గణిత విజ్ఞాన మేళా కార్యక్రమానికి మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను ఆమె ప్రారంభించి, వివిధ ప్రదర్శనలను సందర్శించారు. విద్యార్థులు రూపొందించిన విజ్ఞాన, శాస్త్ర నమూనాలను పరిశీలించి, వారి ప్రతిభను అభినందించారు. శ్రీ సరస్వతీ విద్యాపీఠం తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన విభాగ్ స్థాయి గణిత విజ్ఞాన సంస్కృతి మహోత్సవంలో 9 పాఠశాలలకు చెందిన సరస్వతి శిశు మందిరాల నుంచి విద్యార్థులు, ప్రబంధకారిణి సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ గణిత, విజ్ఞాన ప్రదర్శనలను ఏర్పాటు చేసి ఆకట్టుకున్నారు. విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు గణిత శాస్త్రంలోని వివిధ అంశాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. గణితం కేవలం పాఠ్యాంశం మాత్రమే కాదని, నిత్యజీవితంలో ప్రతి ఒక్కరికీ ఉపయోగపడే ముఖ్యమైన శాస్త్రమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థులు గణితంపై ఉన్న భయాన్ని వీడి ఆసక్తితో సాధన చేయడం ద్వారా ఉన్నత ఫలితాలను సాధించవచ్చని సూచించారు. గణిత విజ్ఞాన మేళలో విద్యార్థులు ప్రదర్శించిన వివిధ నమూనాలు ప్రయోగాలు, గణిత సంబంధిత అంశాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డీఈఓ సత్తయ్య, జిల్లా సైన్స్ అధికారి రాజగోపాల్ రావు, ఎంఈఓ మాళవిక దేవి, కార్పొరేటర్లు షేర్ లక్ష్మీ పవన్, చిలువేరు జ్యోతి, సుధమల్ల హరికృష్ణ, విభాగ్ అధ్యక్షులు డాక్టర్ విష్ణువర్ధన్ రావు, కార్యదర్శి దహగాం గోవిందరావు, ఉపాధ్యక్షులు సదాశివ్, సహకార్యదర్శి గుండం అశోక్, కార్యక్రమ నిర్వాహకులు, పాఠశాల అధ్యక్షులు చందూరి మహేందర్, కార్యదర్శి గుండా సుధాకర్, కోశాధికారి కొమ్మెర విశ్వేశ్వర శర్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రజిని తదితరులు పాల్గొన్నారు.

# తెర ముందు ఎవరు.. తెర వెనుక ఎవరు..?

**ఆసిఫాబాద్ ఆర్సీ (ప్రజాజ్యోతి): ఆగస్టు 22** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం సరండి గ్రామపంచాయతీలో ఇటీవల నిర్వహించిన గ్రామ సభ వ్యవహారం ఇంకా చర్చనీయాంశంగానే కొనసాగుతోంది. గ్రామ ప్రజల సమస్యలు, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై చర్చ జరగాల్సిన గ్రామ సభలో మీడియా అంశం ప్రస్తావనకు రావడంతో పాటు, ఆ తర్వాత చోటుచేసుకుంటున్న పరిణామాలు స్థానికంగా రాజకీయ చర్చకు దారితీస్తున్నాయి. నార్లాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి గ్రామ సభలో మీడియాను ప్రస్తావిస్తూ చేసిన వ్యాఖ్యలపై కొందరు స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. సాధారణంగా గ్రామ సభ అంటే ప్రజలు తమ సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లే వేదిక. అలాంటి సమావేశంలో మీడియా పాత్రపై చర్చకు రావడం వెనుక కారణమేంటనే ప్రశ్నలు ఇప్పుడు వినిపిస్తున్నాయి.

### నార్లాపూర్ కేంద్రంగా కొత్త సమీకరణాలా..?

ఇదిలా ఉండగా.. కొత్తగా ఎన్నికైన నార్లాపూర్ ఉప సర్పంచ్‌తో పాటు కొందరు వార్డు సభ్యులతో సదరు వ్యక్తికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే ప్రచారం స్థానికంగా సాగుతోంది. పంచాయతీలోని కొన్ని అంశాలపై ఒకే అభిప్రాయంతో ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తోందని కొందరు పేర్కొంటున్నారు. అయితే ఇది కేవలం వ్యక్తిగత పరిచయమా? రాజకీయ అవసరాల కోసం ఏర్పడుతున్న అనుబంధమా? లేక భవిష్యత్తులో పంచాయతీ రాజకీయాలను ప్రభావితం చేసేలా ఒక వర్గాన్ని తయారు చేసే ప్రయత్నమా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### వార్డు సభ్యులపై ప్రభావం ఉందా..?

పంచాయతీలో ఎన్నికైన ప్రతి వార్డు సభ్యుడికి తన పరిధిలో ప్రజల సమస్యలను ప్రస్తావించే హక్కు ఉంది. అయితే ఒక వ్యక్తి మాటలకు లేదా సూచనలకు అనుగుణంగా కొందరు సభ్యులు వ్యవహరిస్తున్నారనే ప్రచారం నిజమైతే.. దాని వెనుక ఉన్న కారణాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు అంటున్నట్లు సమాచారం. ఒకవేళ ఇలాంటి ప్రభావం ఏదైనా ఉంటే.. అది పంచాయతీ నిర్ణయాల్లో ఎలా ప్రతిబింబిస్తోంది? అభివృద్ధి పనుల విషయంలో దాని ప్రభావం ఉందా? ఎవరి ప్రతిపాదనలకు ప్రాధాన్యత లభిస్తోంది? అనే అంశాలపై కూడా చర్చ మొదలైంది.

### సర్పంచ్ వర్గం.. ఉప సర్పంచ్ వర్గం..?


సరండి పంచాయతీలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నాయనే ప్రచారం గతంలోనూ వినిపించింది. ఇప్పుడు నార్లాపూర్‌కు చెందిన వ్యక్తి వ్యవహారం కూడా చర్చకు రావడంతో పంచాయతీలో మరో రాజకీయ కోణం బయటపడుతోందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఎవరు ఎవరితో ఉన్నారు? ఎవరి నిర్ణయానికి ఎవరు మద్దతు ఇస్తున్నారు? పంచాయతీలో ఏ అంశంపై ఎవరి మాట నెగ్గుతోంది? వంటి విషయాలను స్థానికులు ఆసక్తిగా గమనిస్తున్నట్లు తెలుస్తోంది.

### గ్రామ సభలో మీడియా ప్రస్తావన ఎందుకు..?

ప్రజా సమస్యలపై ప్రశ్నించే మీడియాను గ్రామ సభలో ప్రస్తావించాల్సిన అవసరం ఏమొచ్చిందనే ప్రశ్న కూడా ఇప్పుడు ప్రధానంగా మారింది. మీడియా ప్రశ్నలు అడగడం, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం ప్రజాస్వామ్య వ్యవస్థలో సాధారణ ప్రక్రియ. అయితే మీడియా ప్రస్తావనతో పాటు కొందరు ప్రజాప్రతినిధులతో సన్నిహిత సంబంధాలపై ప్రచారం రావడం.. ఈ రెండు అంశాలను కలిపి చూస్తున్న కొందరు స్థానికులు ఇందులో ఏదైనా రాజకీయ వ్యూహం ఉందా? అని ప్రశ్నిస్తున్నారు.

### పంచాయతీ వ్యవహారాల్లో బయటి వ్యక్తుల పాత్ర ఎంత..?

ఎన్నికైన ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పంచాయతీ పరిపాలనను నిర్వహించాల్సి ఉంటుంది. ఈ వ్యవస్థకు బయట ఉన్న వ్యక్తులు పంచాయతీ నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నారనే ఆరోపణలు వస్తే.. వాటిపై స్పష్టత రావాల్సిన అవసరం ఉంటుంది. ఎవరైనా వ్యక్తిగతంగా సలహాలు ఇవ్వడం వేరు.. పంచాయతీ




నిర్ణయాలను ప్రభావితం చేయడం వేరు. ఈ రెండింటి మధ్య ఉన్న తేడా ఏమిటన్నది కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

### తెర వెనుక మంత్రాంగం సాగుతోందా..?

గ్రామ రాజకీయాల్లో బయటకు కనిపించేది ఒకటి.. తెర వెనుక జరిగేది మరొకటి అనే మాటలు తరచూ వినిపిస్తుంటాయి. సరండి పంచాయతీలోనూ ఇలాంటి పరిణామాలే చోటుచేసుకుంటున్నాయా? అనే అనుమానాలు ఇప్పుడు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు మీడియా పై వ్యాఖ్యలు.. మరోవైపు కొందరు వార్డు సభ్యులతో సన్నిహిత సంబంధాలు.. ఇంకోవైపు పంచాయతీ వ్యవహారాలపై పరోక్ష ప్రభావం ఉందనే ప్రచారం ఈ మూడు అంశాలు కలిసే సరికి స్థానికంగా రాజకీయ మైండ్‌గేమ్” అనే చర్చకు బలం చేకూరుతోంది.

### ప్రజా సమస్యలు ఎక్కడ..?

ఇన్ని రాజకీయ చర్చల మధ్య అసలు గ్రామ ప్రజల సమస్యలు మాత్రం పక్కకు వెళ్లకూడదని స్థానికులు కోరుతున్నట్లు సమాచారం. తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, సంక్షేమ పథకాలు, పంచాయతీ అభివృద్ధి పనులు వంటి అంశాలపై గ్రామ సభలో సమగ్ర చర్చ జరగాల్సి ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.గ్రామ సభను రాజకీయ ఆధిపత్య ప్రదర్శనకు కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి ఉపయోగించాల్సిన అవసరం ఉందని వారు అంటున్నారు.

### సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలు ఎన్నో..

సరండి పంచాయతీలో జరుగుతున్న పరిణామాలపై ఇప్పుడు కొన్ని ప్రశ్నలు స్థానికంగా చర్చకు వస్తున్నాయి.నార్లాపూర్‌కు చెందిన వ్యక్తి గ్రామ సభలో మీడియాను ఎందుకు ప్రస్తావించారు? ఉప సర్పంచ్, వార్డు సభ్యులతో ఆయనకు ఉన్న సంబంధం ఎంతవరకు ఉంది?

### పంచాయతీ నిర్ణయాలపై ఆయనకు ఏమైనా ప్రభావం ఉందా?

ఎవరైనా వార్డు సభ్యులు ఆయన సూచనల మేరకు వ్యవహరిస్తున్నారా?సర్పంచ్, ఉప సర్పంచ్ వర్గాల మధ్య రాజకీయ సమీకరణాలు మారుతున్నాయా? గ్రామ సభను రాజకీయ వేదికగా మార్చే ప్రయత్నం జరుగుతోందా? మీడియాపై వ్యాఖ్యల వెనుక అసలు ఉద్దేశం ఏమిటి? ఈ ప్రశ్నలకు సంబంధిత వ్యక్తులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు స్పష్టమైన సమాధానాలు ఇస్తేనే ప్రచారాలకు తెరపడే అవకాశం ఉంది.

### వివరణ వస్తేనే అసలు విషయం తేలే అవకాశం..

ప్రస్తుతం స్థానికంగా వినిపిస్తున్న ఆరోపణలు, ప్రచారాల ఆధారంగానే ఈ చర్చ కొనసాగుతోంది. వీటికి అధికారిక నిర్ధారణ లేదు. సంబంధిత వ్యక్తి స్పందన, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల వివరణ, సర్పంచ్ వర్గం అభిప్రాయం వెలుగులోకి వస్తే వాస్తవ పరిస్థితి మరింత స్పష్టమయ్యే అవకాశం ఉంది.అసలు ఇది సహజమైన గ్రామ రాజకీయమా..? లేక ముందస్తు వ్యూహంతో సాగుతున్న మైండ్‌గేమ్‌నా..? మాటల వెనుక మర్మమేంటి..? తెర వెనుక అసలు ఆట ఎవరిది..? సరండి పంచాయతీలో రానున్న రోజుల్లో చోటుచేసుకునే పరిణామాలు ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పనున్నాయా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## 1300 దేశీదారు మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రధాన నిందితుడు అరెస్ట్.. రిమాండ్

మహారాష్ట్ర నుంచి భీంసరి గ్రామానికి అక్రమంగా తరలి స్తుండగా పట్టివేత

కారు, మొబైల్ ఫోన్ స్వాధీనం ఇద్దరిపై కేసు నమోదు

ఆదిలాబాద్ టూ టౌన్ ఇన్ స్పెక్టర్ కె. నాగరాజు





ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 22, (ప్రజా జ్యోతి ) ఆదిలాబాద్ టూ టౌన్ పోలీ స్ స్టేషన్ పరిధిలో అక్రమంగా దేశీదారు మద్యాన్ని తర లిస్తున్న ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తర లించినట్లు ఆదిలాబాద్ టూటౌన్ ఇన్‌స్పెక్టర్ కె.నాగరాజు తెలిపారు. శుక్రవారం విశ్వసనీయ సమాచారం మేరకు ఆదిలాబాద్ పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద పోలీసులు అనుమానాస్ప దంగా ఉన్న కారును తనిఖీ చేయగా, అందులో 13 బా క్సుల్లో 90 ఎంఎల్ పరిమాణం గల మొత్తం 1300 దేశీ దారు మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించారు. దీంతో కారులో మద్యం తరలిస్తున్న ప్రధాన నిందితుడు సిర్పురే జనార్ధన్‌ను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.ఆదిలాబాద్ రూరల్ మండ లం భీంసరి గ్రామానికి చెంది న సిర్పురే జనార్ధన్ మహా రాష్ట్రలోని చాంకా గ్రామానికి వెళ్లి గజానన్ రాములు బట్టిన్వార్ ఏ గజ్జు వద్ద రూ 1,2 8,700/- విలువ గల 1300 (90) దేశీదారు మద్యం బాటిళ్లను కొనుగోలు చేసినట్లు తెలిపారు. అనంతరం వాటిని అక్రమంగా ఆదిలా బాద్ జిల్లాకు తరలించి వి క్రయించి సొమ్ము చేసుకునే ప్రయత్నం చేసినట్లు వెల్ల డించారు. పోలీసులకు అం దిన విశ్వసనీయ సమాచారం మేరకు మార్కెట్ యార్డు వద్ద వాహన తనిఖీలు చేపట్టి నిందితుడిని పట్టుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 130 0 దేశీదారు మద్యం బాటిళ్లు, ఒక కారు, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకు న్నట్లు పేర్కొన్నారు. ఈ వ్యవ హారంలో మద్యం విక్రయిం చిన మహారాష్ట్రకు చెందిన గజానన్ రాములు బట్టిన్వార్ ఏ గజ్జుపై కూడా కేసు న మోదు చేసి దర్యాప్తు కొన సాగిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయించడం, తరలించడం, నిల్వ చేయడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చ ర్యలు తీసుకుంటామని హె చ్చరించారు.

**నిందితుల వివరాలు**

సిర్పురే జనార్ధన్ (48) తం డ్రి అడెల్లు, నివాసం భీంసరి గ్రామం, ఆదిలాబాద్ రూరల్ మండలం, ఆదిలాబాద్ జిల్లా. ప్రధాన నిందితుడు.. అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు.గజానన్ రాములు బట్టిన్వార్ ఏగజ్జు (40) తండ్రి రాములు, నివాసం చాంకా గ్రామం, యవత్మాల్ జిల్లా, మహారాష్ట్ర. నిందితుడు.

**పోలీస్ సిబ్బందికి ఎస్పీ అభి నందనలు**

ఈ కేసులో ఉత్తమ ప్రతిభ కనబరిచి అక్రమ మద్యం తరలింపును అడ్డుకోవడం లో కీలకంగా వ్యవహరించి న కానిస్టేబుళ్లు విట్టల్, క్రాం తిలను జిల్లా ఎస్పీ శుక్రవారం పోలీసు ముఖ్య కార్యాల యంలో ప్రత్యేకంగా అభినందించారు. వారికి ప్రశంసా పత్రాల తో పాటు నగదు రివార్డులను అందజేశారు. ఈ కా ర్యక్రమంలో ఆదిలాబాద్ టూటౌన్ ఇన్‌స్పెక్టర్ కె. నాగరాజు, ఎస్ఐలు అఖిల్, ప్రణయ్, కానిస్టేబుళ్లు క్రాంతి, విట్టల్ తదితరులు పాల్గొ న్నారు.

# ఆటో బంద్‌కు వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల సంపూర్ణ మద్దతు

## 23 అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక బంద్

## ఆటో డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

**మంచిర్యాల, 22 ఆగస్టు (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర ఆటో జేఏసీ పిలుపు మేరకు ఈ నెల 23వ తేదీ అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆటోల నిరవధిక బంద్ నిర్వహించనున్న నేపథ్యంలో మంచిర్యాల జిల్లా ఆటో ఐకాస ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాల నాయకులను కలిసి బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. మంచిర్యాల జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, ముఖ్య నాయకులతో పాటు ప్రజా, కార్మిక సంఘాల నాయకులను ఆటో ఐకాస ప్రతినిధులు కలిసి బంద్‌కు మద్దతు కోరారు. ఇందులో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేరెబెల్లి రఘునాథ్‌రావు, కాంగ్రెస్ పార్టీ మంచిర్యాల కార్పొరేషన్ అధ్యక్షులు తూముల నరేష్, కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఆటో రిక్షా వెల్ఫేర్ అసోసియేషన్ (ఏఆర్‌డబ్ల్యూఏ) మంచిర్యాల జిల్లా అధ్యక్షులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. అదేవిధంగా సీపీఐ జిల్లా సమితి సభ్యులు కలిందర్, సీపీఐ-ఎంఎల్ జిల్లా కార్యదర్శి లాల్‌కుమార్, సీఐటీయూ అధ్యక్షులు రంజిత్‌కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి బ్రహ్మన్న, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు రమేష్, ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షులు సదానందం, ఎంఐఎం పట్టణ అధ్యక్షులు సయ్యద్ అఫ్గాన్ తదితరులను కలిసి ఆటో బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు.

**పెరిగిన ఖర్చులతో ఆటో డ్రైవర్లపై తీవ్ర భారం.........**

ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను నాయకులకు వివరించారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు, వాహనాల మరమ్మతులు, నిర్వహణ ఖర్చులు, ఫైనాన్స్ భారం, చలాన్లు, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ ఖర్చులు రోజురోజుకు పెరుగుతున్నాయని తెలిపారు. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో జీవన వ్యయం అధికమై ఆటో డ్రైవర్ల కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని అన్నారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం, ఉచిత బస్సు పథకం కారణంగా ఆటో డ్రైవర్ల ఆదాయంపై పడుతున్న ప్రభావం, యాప్ ఆధారిత సంస్థల కారణంగా సంప్రదాయ ఆటో డ్రైవర్లకు ప్రయాణికులు తగ్గడం, ఆదాయం గణనీయంగా పడిపో వడం వంటి సమస్యలను కూడా నాయకుల దృష్టికి తీసుకెళ్లారు.

**సమస్యల పరిష్కారానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా..**

ఆటో డ్రైవర్లు తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించాలని గత కొంతకాలంగా కోరుతున్నప్పటికీ తగిన స్థాయిలో స్పందన, పరిష్కారం లభించలేదని ఆటో ఐకాస నాయకులు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం పలు సందర్భాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పరిస్థితిలో మార్పు రాకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఈ నెల 23వ తేదీ అర్ధరాత్రి నుంచి నిరవధిక బంద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని వివరించారు.



**బంద్‌కు సంపూర్ణ మద్దతు.......**

ఆటో ఐకాస నాయకులు వివరించిన సమస్యలను సానుకూలంగా విన్న ఆయా రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాల నాయకులు ఆటో డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ నెల 23వ తేదీ అర్ధరాత్రి నుంచి నిర్వహించనున్న నిరవధిక ఆటోల బంద్‌కు అండగా నిలుస్తామని తెలిపారు. ఆటో డ్రైవర్ల సమస్యలు కేవలం వారి వ్యక్తిగత సమస్యలు మాత్రమే కాదని, లక్షలాది ఆటో కార్మికులు, వారి కుటుంబాల జీవనోపాధికి సంబంధించిన అంశమని నాయకులు పేర్కొన్నారు. ఆటో డ్రైవర్ల జీవనోపాధిని కాపాడే విధంగా ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టి, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని నిర్ణయించారు .ఆటో కార్మికుల సమస్యలపై మద్దతు ప్రకటించిన నాయకులు తమకు అండగా నిలవడంతో పోరాటానికి మరింత బలం చేకూరిందని మంచిర్యాల జిల్లా ఆటో ఐకాస పేర్కొంది. తమ సమస్యలపై మద్దతు ప్రకటించినట్లే రాష్ట్ర ప్రభుత్వంపై కూడా ఒత్తిడి తీసుకువచ్చి ఆటో డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేలా ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని కోరింది. ఆటో కార్మికుల హక్కుల సాధన కోసం జరిగే ఈ పోరాటంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాల మద్దతు, సహకారం కొనసాగాలని విజ్ఞప్తి చేసింది. ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేసింది. ఆటో బంద్‌కు మద్దతు ప్రకటించిన నడిపెల్లి దివాకర్‌రావు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే, వేరెబెల్లి రఘునాథ్‌రావు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, తూముల నరేష్ కాంగ్రెస్ మంచిర్యాల కార్పొరేషన్ అధ్యక్షులు, కాంగ్రెస్ అనుబంధ ఏఆర్‌డబ్ల్యూఏ జిల్లా అధ్యక్షులు, కలిందర్ సీపీఐ జిల్లా సమితి సభ్యులు, లాల్‌కుమార్ సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి, రంజిత్‌కుమార్ సీఐటీయూ అధ్యక్షులు, బ్రహ్మన్న ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి, రమేష్ ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు, సదానందం ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షులు, సయ్యద్ అఫ్గాన్ ఎంఐఎం పట్టణ అధ్యక్షులు తదితరులకు మంచిర్యాల జిల్లా ఆటో ఐకాస హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా ఆటో ఐకాస నాయకులు, వివిధ ఆటో యూనియన్ల ప్రతినిధులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు. 23 అర్ధరాత్రి నుంచి నిరవధిక ఆటోల బంద్ నిర్వహించి, ఆటో డ్రైవర్ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా పోరాడుతామని తెలంగాణ రాష్ట్ర ఆటో జేఏసీ పిలుపు మేరకు మంచిర్యాల జిల్లా ఆటో ఐకాస నాయకులు శనివారం స్పష్టం చేశారు.

## పాఠశాల విద్యార్థులకు షూల పంపిణీ

**నేరడిగొండ ఆగస్టు 22 (ప్రజాజ్యోతి):** మండల పరిధిలోని లఖంపూర్ (జి) గ్రామ పంచాయతీ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు షూల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ సేడమకి సుజాత గంగాధర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బూట్లను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు రాథోడ్ తుకారాం, అంగన్‌వాడీ టీచర్



గోదావరి, గ్రామస్తులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థను సరిచేయకుండా దేశాన్ని విశ్వగురువుగా ఎలా మారుస్తారు?

### విద్యా వ్యవస్థలో లోపాలు, పరీక్షల లీకేజీలపై జెన్‌జీ, జెన్‌ఆల్ఫా నిరసనలు పాలకులకు హెచ్చరిక

### నాణ్యమైన విద్య, పారదర్శక పరీక్షా విధానం, నిరుద్యోగ రహిత వ్యవస్థ కావాలి

### భారత కమ్యూనిస్టు పార్టీ (అంబేద్కర్--మార్క్స్) జిల్లా కమిటీ సభ్యులు దూలం శ్రీనివాస్

**మంచిర్యాల, 22 ఆగస్టు (ప్రజాజ్యోతి):** దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు పూర్తవుతున్నా దేశ అభివృద్ధికి పునాదిగా నిలిచే విద్యా వ్యవస్థలో నెలకొన్న లోపాలను పాలకులు పరిష్కరించకపోవడం దురదృష్టకరమని భారత కమ్యూనిస్టు పార్టీ (అంబేద్కర్--మార్క్స్) జిల్లా కమిటీ సభ్యులు దూలం శ్రీనివాస్ అన్నారు. దేశ పునాది వ్యవస్థను బలోపేతం చేయకుండా దేశ అభివృద్ధి, విశ్వగురువు, అచ్చేదిన్, వికసిత్ భారత్, ఆత్మనిర్భర్ భారత్, ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ అంటూ గొప్పలు చెప్పడం వల్ల ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. విద్యా వ్యవస్థలో జరుగుతున్న లోపాలను సరిచేయకుండా 56 అంగుళాల ఛాతీ ఎవరి కోసం అని విమర్శించారు. దేశంలో పాలకులు ఇంతకాలం ప్రజలకు, ప్రపంచానికి తెలియకుండా దాచిపెట్టాలని ప్రయత్నించిన అనేక కఠోర వాస్తవాలు ప్రస్తుతం జెన్‌జీ, జెన్‌ఆల్ఫా తరాల నిరసనలు, సోషల్ మీడియా ప్రచారాల ద్వారా వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలు, ప్రాథమిక విద్యా వ్యవస్థలోని లోపాలు, నిరుద్యోగ సమస్యలపై విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున రోడ్లపైకి రావడం ఇందుకు నిదర్శనమన్నారు. అసలు విద్యా వ్యవస్థలో జరుగుతున్న లోపాలు ఏమిటి, విద్యార్థులు, యువత కోరుకుంటున్నదేమిటి, పాలకులు చెబుతున్న అభివృద్ధి మాటలకు క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులకు మధ్య ఉన్న వ్యత్యాసం ఏమిటి అనే విషయాలను సమాజం లోతుగా ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. దేశానికి అవసరమైన శాస్త్రవేత్తలు, వైద్యులు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, అధికారులు, నిపుణులు, మేధావులు ఇలా ఏ రంగానికి చెందిన వారినైనా తయారు చేసే ఏకైక వ్యవస్థ విద్యా వ్యవస్థేనని దూలం శ్రీనివాస్ అన్నారు. అలాంటి విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో పాలకుల చిత్తశుద్ధి ఏమిటని ప్రశ్నించారు. విద్యకు బడ్జెట్‌లో ఎంత నిధులు కేటాయిస్తున్నారు, కేటాయించిన నిధుల్లో ఎంత ఖర్చు చేస్తున్నారు, ఆ నిధులు ఎక్కడ ఖర్చవుతున్నాయనే వివరాలను ప్రజలకు పూర్తిస్థాయిలో బహిర్గతం చేయడం లేదని ఆరోపించారు. గత 12 సంవత్సరాల్లో 90 వేలకుపైగా పాఠశాలలు ఎందుకు మూతపడ్డాయో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదులు, కుర్చీలు, భవనాలు, బ్లాక్‌బోర్డులు, పౌష్టికాహారం, సరిపడా ఉపాధ్యాయులు, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు వంటి కనీస మౌలిక సదుపాయాలు ఎన్ని పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఉన్నాయో ప్రభుత్వం వెల్లడించాలని కోరారు. విద్యార్థులు పాఠశాలకు చేరుకోవడానికి అవసరమైన రహదారి సౌకర్యాలు కూడా అనేక ప్రాంతాల్లో సరిగా లేవన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన పాలకులు దానిని నిర్లక్ష్యం చేయడం వల్ల పేదలు, కార్మికులు, రైతులు, వెనుకబడిన వర్గాల పిల్లలు నాణ్యమైన విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. ప్రభుత్వ పాఠశాల అంటేనే వెనుకబడిన వర్గాల పిల్లలకు ఇచ్చే బిక్ష అన్నట్లుగా విద్యా వ్యవస్థను తయారు చేయడం వెనుక పాలకుల వైఖరి ఎంత మోసపూరితంగా ఉందో అర్థమవుతోందని విమర్శించారు. నాణ్యమైన విద్య కావాలని, లోపాలు లేని పరీక్షా విధానం కావాలని, ప్రశ్నపత్రాల లీకేజీలకు శాశ్వత పరిష్కారం కావాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని కోరుతూ జెన్‌జీ యువత పెద్ద ఎత్తున ఉద్యమించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందన్నారు. యువతను తక్కువగా అంచనా వేసిన పాలకులకు ఈ ఉద్యమాలు గుణపాఠం చెబుతున్నాయని అన్నారు. దేశ నలుమూలల నుంచి యువత ఢిల్లీ నడిబొడ్డునకు చేరుకుని తమ సమస్యలపై గళమెత్తడం సముద్రపు ఉగ్ర అలలను తలపించిందన్నారు. ఈ పోరాటాల ప్రభావంతో పాలకులు కూడా ప్రజలకు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడిందని, సెల్ఫ్ వీడియోల ద్వారా ప్రజలను ఉద్దేశించి మాట్లాడే పరిస్థితి రావడం యువత ఉద్యమానికి లభించిన తొలి విజయంగా అభివర్ణించారు. జెన్‌జీ పోరాటం ఇచ్చిన స్ఫూర్తితో జెన్‌ఆల్ఫా కూడా తమ సమస్యల



పరిష్కారం కోసం రంగంలోకి రావడం మరో కీలక పరిణామమని దూలం శ్రీనివాస్ అన్నారు. చిన్నారుల సమస్యలను కూడా ప్రభుత్వం పట్టించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తమ సమస్యలపై రోడ్లపైకి వచ్చి నిరసనలు చేయడమే కాకుండా సోషల్ మీడియాను తమ ఆయుధంగా మార్చుకుని తాము ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులను ప్రపంచానికి తెలియజేస్తున్నారని తెలిపారు. పాఠశాలల్లో తాము ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యా వ్యవస్థలోని లోపాలు, పరీక్షల విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులు, భవిష్యత్తుపై ఉన్న ఆందోళనలను వీడియోల ద్వారా ప్రజల ముందుకు తీసుకువస్తున్నారని అన్నారు. విద్యా వ్యవస్థలో ఉన్న లోపాలను సరిచేయడం, పరీక్షల విధానాన్ని పారదర్శకంగా మార్చడం, ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టడం, ప్రతి విద్యార్థికి సమాన విద్యా అవకాశాలు కల్పించడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం తప్ప ఈ సమస్యకు మరే ప్రత్యామ్నాయం లేదన్నారు. జెన్‌జీ, జెన్‌ఆల్ఫా నిరసనలు, సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న ప్రచారాలు దేశంలోని అణగారిన, నిరుత్సాహానికి గురైన ప్రజలకు కొత్త ఊపిరిని అందిస్తున్నాయని దూలం శ్రీనివాస్ అన్నారు. లేకపోతే విద్యార్థులు, యువత నుంచి ప్రారంభమైన ఈ ఉద్యమాలు క్రమంగా కార్మికులు, రైతులు, నిరుద్యోగులు, దోపిడీకి గురవుతున్న అన్ని వర్గాలకు విస్తరించి సమగ్ర ప్రజా ఉద్యమంగా మారే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా ఎన్ని ప్రచారాలు చేసినా, ఎంతగా మభ్యపెట్టినా వాస్తవాలను దాచడం సాధ్యం కాదని దూలం శ్రీనివాస్ స్పష్టం చేశారు.

## ఆరోగ్య తెలంగాణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

### రాష్ట్ర క్రీడాశాఖ ప్రత్యేక కార్యదర్శి జమేష్ రంజన్

**ఆసిఫాబాద్ ప్రతినిధి, ఆగస్టు 22 (ప్రజాజ్యోతి)**ఆరోగ్యకరమైన తెలంగాణ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ శారీరకంగా చురుకుగా ఉండేలా ఫిజికల్ లిటరసీపై విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర క్రీడాశాఖ ప్రత్యేక కార్యదర్శి జమేష్ రంజన్ సూచించారు. నిత్యజీవితంలో యోగా, క్రీడలు, నడక, వ్యాయామాన్ని భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని షాప్ కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా ఫిజికల్ లిటరసీ కార్యక్రమాల అమలు, కార్యాచరణ ప్రణాళికపై దిశానిర్దేశం చేశారు. ఆరోగ్యంగా ఉండేందుకు శారీరక అక్షరాస్యత ఎంతో కీలకమని, చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో క్రీడలు, వ్యాయామంపై ఆసక్తి పెంచాలని తెలిపారు. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్సిటీతో సమన్వయం చేసుకుంటూ జిల్లాల్లో కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రణాళిక, సమన్వయం, అమలును జిల్లా స్థాయిలో పకడ్బందీగా పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అశ్వక్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు




కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఫిజికల్ లిటరసీ కార్యక్రమాన్ని అధికారుల సమన్వయంతో పకడ్బందీగా అమలు చేస్తామని తెలిపారు. పాఠశాల విద్యాశాఖతో పాటు ఒలింపిక్ అసోసియేషన్, జాతీయ--అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు, క్రీడా క్లబ్బుల సభ్యులను భాగస్వామ్యం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నదీమ్, జిల్లా మాధ్యమిక విద్యాధికారి రాందార్ తదితరులు పాల్గొన్నారు.

# తువులకు ఉన్న ప్రాధాన్యత మనుషులకు లేదు



అధికారుల పై తీవ్రంగా మండిపడ్డ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



ఉట్నూర్ లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన ఆదిలాబాద్ జిల్లా సమీక్షా సమావేశంలో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 22, (ప్రజా జ్యోతి )** నేటి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కనీసం జంతు వులకు ఉన్న ప్రాధాన్యత మనుష లకు లేదని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అధికారుల పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కేబి కాంప్లెక్స్‌లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అధ్యక్షతన ఆదిలాబాద్ జిల్లా గిరిజన సంక్షేమం, సాంఘిక సంక్షేమం, దివ్యాంగుల శాఖల అధికారులతో అభివృద్ధి కా ర్యక్రమాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్ర మంత్రి వచ్చి దివ్యాంగుల కు సైకిళ్ళు అం దజేసే విషయం కనీసం ఎమ్మెల్యేలకు సమాచారం లేదని మండిపడ్డారు. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలకు అధికారులు కనీసం సమాచారం ఇవ్వకపోవడం సరైన పద్ధతి కాదని మండిపడ్డా రు.వందలాది ఏండ్లుగా మారుమూల ప్రాంతాల్లోని వసిస్తున్న గిరిజనులకు కొత్తగా తీసుకొచ్చిన చట్టాలతో ఇబ్బందులు పెట్టడం సమం జసం కాదని, అటవీ అధికా రులు హింసించడం మాను కోవాలన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చద వడానికి ఆసక్తి చూపిస్తున్న ప్పుడు ప్రభుత్వం వాళ్ళకి సహకరించి ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లను పెంచాలని డిమాండ్ చేశారు. పిల్లలకు మెరుగైన విద్య అందించడం ముఖ్యం, చదువే భవిష్యత్తు నిర్మిస్తుంది కానీ ఇతర పనులు కాదని అన్నారు. గతంలో గిరిజనులతో కల క ళ లాడిన ఐటిడిఏ లు ఇప్పుడు కనీసం గెట్ వద్దకు కూడా ప్రజలు రాక దివాలగా మారాయి. వాటికి నిధు లు కేటాయించి అధికారం ఇవ్వాలని డిమాండ్ చేశా రు.ఈ సందర్భంగా మంత్రి దృష్టికి పలు కీలక అంశాల ను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తీసుకెళ్లారు. ఫారెస్టు అధి కారులు అమాయక గిరిజ నులను ఇబ్బందులు పెట్టడం మానుకో వాలని, ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లు పెంచి విద్యార్థుల భవిష్యత్తుకు స హకరించాలని,ఐటిడిఏను అభివృద్ధి చేసి వాటికి అధికారం ఇవ్వాలని కోరారు. ఎస్సి కార్పోరేషన్ ద్వారా నియోజకవర్గంలో గల బోర్లు, మోటర్ల సమస్యలు తీర్చాలని, ఎన్ ఎచ్ 44 జాతీయ రహదా రిపై ఉండే నెరడిగొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అటవీశాఖ భూమి అనితిప్పలు పెట్టడం సరికాదని అన్నా రు. పోడు పట్టాల రైతులకు ఇబ్బందులు పెట్టొ ద్దని అన్నారు. జంతువుల కోసం ఫ్లైఓవర్ బ్రిడ్జీలు నిర్మి స్తున్నారు కానీ గిరిజనుల పట్ల కనీసం కనికరించట్లేద ని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి

## విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం

## డీజేఎల్పీ నేత ,స్థానిక శాసన సభ్యులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి





**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,ఆగష్టు 22 ,( ప్రజాజ్యోతి ).** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తుందని డీజేఎల్పీ నేత ,ఎంఎల్ఏ మహేశ్వర్ రెడ్డి విమర్శించారు శనివారం హైదరాబాదులోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో "ఫీజుల బకాయి బిజెపి లడాయి" పేరుతో చేపట్టనున్న నిరాహార దీక్షకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవి ష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్న రెండ్లు గడుస్తున్న కూడా రాష్ట్రానికి ఇప్పటివర కు పూర్తిస్థాయి విద్యా శాఖ మంత్రి లేకపోవ డం సిగ్గుచేటని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యావ్యవస్థను అస్తవ్యస్తం చేస్తు న్నారని ఆరోపిం చారు ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న కూడా ప్రభుత్వం పట్టించుకోవ దం లేదని ఆయన మండిపడ్డారు.రాష్ట్రంలో సుమారు 2,120 ప్రభు త్వ పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయని 1,752 పాఠశాలల్లో బాలికలకు కనీస మరుగుదొడ్డి సౌకర్యాలు కూడా లేవని ఆయన తెలిపారు. విద్యారంగానికి తగినన్ని నిధులు కేటాయించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు ప్రభుత్వ ఖజానాపై భారం మోపి విహారయాత్రలు మానుకొని విద్యార్థుల సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు రాష్ట్రంలో సుమారు రూపాయలు 15 వేలకోట్ల ఫీజు రిమ్ రియంబర్స్మెం ట్ బకాయిలు పేరుకుపోయాయని దీనితో 14 లక్షల మంది విద్యార్థులు భవిష్యత్తు గందరగోళంలో పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలపై ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చేందుకు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రారావు ఆధ్వర్యంలో 48 గంటల నిరాహార దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు ఈ దీక్షలో బిజెపి ఎంపీలు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు పాల్గొని విద్యార్థులకు మద్దతుగా నిలబడతారని చెప్పారు. ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు పూర్తిగా చెల్లించే వరకు విద్యార్థుల పక్షాన బిజెపి పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## "సెన్సస్ హ్యాండ్‌బుక్.. జిల్లా అభివృద్ధికి దిక్సూచి"

శాఖలవారీ సమాచారాన్ని గడువులోగా సమర్పించాలి

"సెన్సస్ హ్యాండ్‌బుక్ రూపకల్పనకు వేగం పెంచాలి"

జిల్లా అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్‌లు




**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,ఆగష్టు 22 ,( ప్రజాజ్యోతి ).** సెన్సస్ హ్యాం డ్ బుక్ తయారీకి సంబంధించి శాఖలవారీగా పూర్తి వివరాలను నిర్దేశిత గడువులోగా సమర్పించాలని జిల్లా అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్‌లు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం సెన్సస్ హ్యాండ్ బుక్ రూపకల్పనపై వివిధ శాఖల అధికారులతో వారు సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రణాళిక శాఖ అందిం చిన ప్రామాణిక నమూనా ప్రకారం క్షేత్రస్థాయిలో అవసరమైన సమాచారాన్ని సేకరించాలని సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ, ప్రచురించే హ్యాండ్ బుక్ జిల్లా అధికారిక రికార్డుగా నిలుస్తుందని, శాఖల వారీగా ఇచ్చే గణాం కాలలోఎలాంటి తప్పులు లేకుండా పూర్తి కచ్చితత్వం ఉండాలని స్పష్టం చేశారు. అలాగే సమాచారం పునరావృతం కాకుండా ఉండేందుకు వివిధ శాఖల అధికారులు ఒకరికొకరు పరస్పర సమన్వయంతో వ్యవహరించాలని పేర్కొన్నారు.అధికారులు సమ ర్పించే ఈ సమగ్ర నివేదికలు జిల్లా భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు క్షేత్రస్థాయిలో సరిగ్గా చేర్చడానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. సమాచార సేకరణ, నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ రాకేష్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, సిపిఓ గంగారెడ్డి, డీఈఓ భోజన్న, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే జీవో 97ను వెంటనే రద్దు చేయాలి

బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నిరంజన్ రెడ్డి




**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,ఆగష్టు 22 ,( ప్రజాజ్యోతి ).**పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు శనివారం నిర్మల్ జిల్లా కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఆందోళన చేపట్టారు కళాశాల నుంచి శివాజీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించా రు అనంతరం రోడ్డుపై మానవహారం చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు పాలిటెక్నిక్ డిప్లమో కోర్సులను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసేందుకు తీసుకొచ్చిన జీవో నెంబర్ 97తో విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని ఆరోపించారు ముఖ్యమంత్రి తీసుకొచ్చిన శక్తి స్కీం వల్ల విద్యార్థుల మూడేళ్ల విద్యాభ్యాసం వృధా అయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే ఈ జీవోను రద్దు చేయాల ని ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు

# కలం నుండి కాగితం వరకు కథా రచనపై కార్యశాల



**సోన్, ఆగస్టు 22(ప్రజా జ్యోతి):**సోన్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల న్యూ వెల్మల్ బొప్పారంలో తెలంగాణ సారస్వత పరిషత్తు, శాంతా వసంత ట్రస్టు సౌజన్యంతో ఉన్నత పాఠశాల విద్యార్థులకు కథా రచన -- సృజన కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కొప్పుల లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే కథా రచన పట్ల ఆసక్తిని పెంపొందించు కోవాలని అన్నారు. కథలు మానసిక ఉల్లాసాన్ని కలిగించడంతో పాటు సమాజానికి మంచి సందేశాన్ని అందించే బలమైన సాహిత్య ప్రక్రియ అని పేర్కొన్నారు. కథలను ఇష్టపడని వారు ఎవరూ ఉండరని, విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు కథా రచన ఎంతో దోహదపడుతుందని తెలిపారు. సారస్వత పరిషత్తుచే నియమించబడిన విషయ నిపుణులు ప్రవీణ్ శర్మ, సమన్వయం కర్త కొండూరు పోతన్న విద్యార్థులకు కథా రచనలోని మెలకువలు, కథా వస్తువు ఎంపిక, పాత్రల రూపకల్పన, కథనం ముగింపు తదితర అంశాలను వివరించారు. ఆరవ తరగతి పుస్తక రచయిత గంగుల చిన్నన్న మాట్లాడుతూ కథ రచనపై ఆసక్తి పెంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్మల్ బొప్పారం నుండి నలభై నలుగురు మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మహాగాం పాఠశాలలకు చెందిన ఆరుగురు మొత్తం యాభై మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు తమ సృజనాత్మకతకు పదును పెడుతూ ఒక్కొక్కరు ఒక కథను రచించారు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులందరికీ తెలంగాణ సారస్వత పరిషత్తు తరపున ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు కవిత, భారతి, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకులు డేరా కృష్ణా రెడ్డి తండ్రి గంగారెడ్డి పెద్ద కర్మ కార్యక్రమానికి హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించిన ఏఎంసీ చైర్మ న్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



**ఇచ్చోడ, ఆగస్టు 22, (ప్రజా జ్యోతి )** ఇచ్చోడ మండలం బోరిగా మ గ్రామానికి చెందిన కాంగ్రె స్ నాయకులు డేరా కృష్ణ రెడ్డి తండ్రి డేరా పెద్ద గంగా రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి ప విత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ నిర్వహించిన పెద్ద కర్మ కార్యక్రమానికి ఆదిలాబాద్ మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ డీ సీసీబీ చైర్మన్ అడ్డి భోజ రెడ్డి లతో కలిసి ఆదిలాబాద్ వ్య వసాయ మార్కెట్ కమిటీ చై ర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సంద ర్భంగా డేరా గంగారెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరా మర్శించారు. ఈ కార్యక్ర మం లో డిసిసి ప్రధాన కార్య దర్శులు ధర్మపురి చంద్రశేఖ ర్, మాల్యాల కరుణాకర్, సర్పంచ్ ఆసిఫ్ ఖాన్, ప్రఫుల్ చందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రి పై సుస్మిత వ్యాఖ్యలకు మంత్రి సురేఖ క్షమాపణలు చెప్పాలి

మీడియా జిల్లా కోఆర్డినేటర్ మేకల జితేందర్




**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 22, (ప్రజా జ్యోతి )** తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పై మంత్రి కొండా సురేఖ కూతురు కొండా సుష్మిత చేసిన అనుచిత వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ రాష్ట్ర మంత్రి కొం డా సురేఖ తెలంగాణ ప్ర జ లకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి క్షమాపణలు చెప్పా లని కాంగ్రెస్ పార్టీ జిల్లా మీ డియా కోఆర్డినేటర్ మేకల జితేందర్ డిమాండ్ చేశారు. రాజకీయాల్లో విమర్శలకు, భిన్నాభిప్రాయాలకు ప్రజా స్వామ్యంలో స్థానం ఉంది. కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని, వ్యక్తిగత గౌరవాన్ని కించపరిచే విధంగా మాట్లాడటం ఏమాత్రం సమర్థనీ యం కాదని అన్నారు. తెలంగాణ ప్రజల తీర్పుతో ము ఖ్యమంత్రి బాధ్యతలు నిర్వ హిస్తున్న నాయకుడిని అవమానించే హక్కు ఎవరికీ లే దని, పదవులు, రాజకీయ కుటుంబ నేపథ్యం శాశ్వతం కాదని అన్నారు. ప్రజలే అం తిమ నిర్ణేతలు అనే విష యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుం చుకోవాలని, వ్యక్తిగత విమర్శలకు దిగకుండా విధానాల పై, పాలనపై మాట్లాడండి, ప్రజా సమస్యలపై ప్రశ్నించండి, కానీ అసభ్యకరమైన భా షతో రాజకీయ సంస్కృతిని దిగజార్చడం మాత్రం సహిం చేది లేదని అన్నారు. కొండా సుస్మిత మాట్లాడే ముందు పదవి గౌరవాన్ని, ప్రజాస్వామ్య విలువలను, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని గు ర్తు చేసుకోవాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కించపరిచే వ్యాఖ్యలను ఆదిలాబాద్ జిల్లా మీడియా కోఆర్డినేటర్‌గా ఆయన తీ వ్రంగా ఖండించారు.

## గిరిజన హక్కుల సాధనకు 'ఐటీడీఏ ముట్టడి'ని విజయవంతం చేయండి



**సోనాల, ఆగస్ట్ 22 ( ప్రజాజ్యోతి ):** గిరిజనుల సుదీర్ఘ కాల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మరియు అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపిస్తూ, ఈ నెల 24 తేదీన తలపెట్టిన 'ఐటీడీఏ ఉట్నూర్ కార్యాలయ ముట్టడి' కార్యక్రమాన్ని ఏజెన్సీ పరిధిలోని గిరిజనులు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని గిరిజన సంక్షేమ సంఘా ల నాయకులు పిలుపునిచ్చారు. స్థానికంగా నిర్వహించిన సమావే శంలో నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సోనాల మండలం తుడుం దెబ్బ మండల అధ్యక్షులు జుగ్నక్ మారుతి, ఉపాధ్యక్షులు జాకేష్, సార్మేడి తోడ సం లక్ష్మణ్ పాల్గొన్నారు.

## ఎం సీ ఎఫ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**లక్ష్మణ చాంద, ఆగస్టు 22 (ప్రజా జ్యోతి)** ఈ నెల 23 వ తేదీన ఎచ్‌టీ+టూ భవనం లో నిర్వహించే మాల కో ఆర్డినేషన్ ఫోరం జిల్లా సమీక్ష సమావేశాన్ని విజయవంతం చేయాలని వీజీఖీ జీూజ కమిటీ నాయకులు బత్తుల రంజిత్, కొంతం మురళీధర్ అన్నారు. ఈ రోజు లక్ష్మణ చాంద మండల కేంద్రం లో మాల సంఘం నాయకులతో కలిసి పోస్టర్ విడుదల చేశారు ఈ సందర్భంగా సంఘం సభ్యులు అజయ్, పెద్దులు రవి, చింటూ , సృజన్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ ఎస్సీ ఎస్టీ వారికి అన్ని రంగాల్లో అవకాశం కల్పించాలి



**లక్ష్మణ చాంద, ఆగస్టు 22 (ప్రజా జ్యోతి)** 90 శాతం ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీలకు సమస్త రంగాల్లో సమాన వాటా కల్పించే బాధ్యత బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీదే అని జేఏసీ జిల్లా అధ్యక్షులు యాటకారి సాయన్న అన్నారు. శనివారం రోజున మండల కేంద్రంలోని రాధాకృష్ణ ఫంక్షన్ హాల్లో బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా జేఏసీ చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో బీసీ ఎస్సీ ఎస్టీలకు ఏ సమస్యలున్నా పరిష్కరిస్తూ, విద్యా వైద్యం ఉపాధి భూమిని అందరికీ పంచే ఒక బృహత్తరమైన ఉద్యమాన్ని ప్రారంభించారని, దానికి విద్యావంతులు నాయకత్వం వహించాల ని పిలుపునిచ్చారు. గ్రామ గ్రామానికి జేఏసీ ను విస్తరిస్తూ, వేల సంవత్సరాలుగా అగ్ర కులాలు చేస్తున్న దోపిడిని వివరిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు రామగిరి రవీందర్, జిల్లా కార్యదర్శి కల్లూరు సుధాకర్, జిల్లా అధికార ప్రతినిధి ముద్రబోయిన వినేష్,బిర్కుల సురేష్, లక్కల రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేత



**లక్ష్మణ చాంద, ఆగస్టు 22 (ప్రజా జ్యోతి)** వడ్యాల్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు గ్రామానికి చెందిన హైదరాబాద్ లో నివాసం ఉంటున్న నల్ల వినయ్ రెడ్డి శనివారం రోజున వారికి 30,000 రూపాయలను అందజేశారు. పది ఫలితాల్లో ఉత్తమ మార్కులతో మొదటి స్థానం సాధించిన కనకాపూర్ గ్రామానికి చెందిన నయనం రిషిత కు 20,000, వడ్యాల్ గ్రామానికి చెందిన పుట్టి లాస్యకు రూ. 10,000 అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు లక్ష్మణ్, శ్రీనివాస్ సత్యనారాయణ భీమేష్, అశోక్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భూషణ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ మండల కమిటీ ఎన్నిక

**లక్ష్మణ చాంద, ఆగస్టు 22 (ప్రజా జ్యోతి)** లక్ష్మణ చాంద మండల కేంద్రంలోని రాధాకృష్ణ ఫంక్షన్ హాల్లో శనివారం రోజున బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సుంకరి సురేష్ ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా జంజూరు గోవర్ధన్, సుంకరి సుదర్శన్, గజ్జల విలాస్, ప్రధాన కార్యదర్శిగా బెంద్రీవార్ శ్రీనివాస్, మండల అధికార ప్రతినిధిగా కొండ్ర అశోక్, సెక్రటరీగా భీమర్తి ప్రవీణ్,దేవుళ్ళ రమేష్, ప్రచార కార్యదర్శి సోన్న గంగాధర్, కోశాధికారిగా సుంకరి గంగయ్య, సలహాదారులుగా ఎర్రబోయిన శ్రీనివాస్, చవ్వ పరమేశ్వర్ తదితరులను ఎన్నుకున్నారు

## రాష్ట్ర ముఖ్యమంత్రి పై సుస్మిత వ్యాఖ్యలకు మంత్రి సు రేఖ క్షమాపణలు చెప్పాలి

**మీడియా జిల్లా కోఆర్డినేటర్ మేకల జితేందర్**



**ఆదిలాబాద్ బ్యూరో, ఆగష్టు 22, (ప్రజా జ్యోతి )** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై మంత్రి కొండా సురేఖ కూతురు కొండా సుష్మిత చేసిన అను చిత వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ తెలంగాణ ప్ర జ లకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి క్షమాపణలు చెప్పా లని కాంగ్రెస్ పార్టీ జిల్లా మీ డియా కోఆర్డినేటర్ మేకల జితేందర్ డిమాండ్ చేశారు. రాజకీయాల్లో విమర్శలకు, భిన్నాభిప్రాయాలకు ప్రజాస్వామ్యంలో స్థానం ఉంది. కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని, వ్యక్తిగత గౌరవాన్ని కించపరిచే విధంగా మాట్లాడటం ఏమాత్రం సమర్థనీ యం కాదని అన్నారు. తెలం గాణ ప్రజల తీర్పుతో ము ఖ్యమంత్రి బాధ్యతలు నిర్వ హిస్తున్న నాయకుడిని అవ మానించే హక్కు ఎవరికీ లేదని, పదవు లు, రాజకీయ కుటుంబ నేపథ్యం శాశ్వతం కాదని అన్నారు. ప్రజలే అం తిమ నిర్ణేతలు అనే విష యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుం చుకోవాలని, వ్యక్తిగత విమ ర్శలకు దిగకుండా విధానాల పై, పాలనపై మాట్లాడండి, ప్రజా సమస్యలపై ప్రశ్నించండి, కానీ అసభ్యకరమైన భాషతో రాజకీయ సంస్కృతిని దిగజార్చడం మాత్రం సహిం చేదిలేదని అన్నారు.కొండా సుస్మిత మాట్లాడే ముందు పదవి గౌరవాన్ని, ప్రజాస్వా మ్య విలువలను, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని గు ర్తు చేసుకోవాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కించపరిచే వ్యాఖ్యలను ఆదిలాబాద్ జిల్లా మీడియా కోఆర్డినేటర్గా ఆయన తీ వ్రంగా ఖండించారు.

# జంతువులకు ఉన్న ప్రాధాన్యత మనుషులకు లేదు





అధికారుల పై తీవ్రంగామం డిపడ్డ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఉట్నూర్ లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన ఆదిలాబాద్ జిల్లా సమీక్షా సమావేశంలో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 22, (ప్రజా జ్యోతి )** నేటి కాంగ్రెస్ ప్రభుత్వ పాల నలో కనీసం జంతు వులకు ఉన్న ప్రాధాన్యత మనుషు లకు లేదని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అధికారుల పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కేబి కాంప్లెక్స్లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అధ్యక్షతన ఆదిలాబాద్ జిల్లా గిరిజన సంక్షేమం, సాంఘిక సంక్షేమం, దివ్యాంగుల శాఖల అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్ర మంత్రి వచ్చి దివ్యాంగులకు సైకిళ్ళు అందజేసే విషయం కనీసం ఎ మ్మెల్యేలకు సమాచారం లేదని మండిపడ్డారు. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలకు అధికారులు కనీసం సమాచారం ఇవ్వకపోవడం సరైన పద్ధతి కాదని మండిపడ్డారు. వందలాది ఏండ్లుగా మారుమూల ప్రాంతాల్లో ని వసిస్తున్న గిరిజనులకు కొత్తగా తీసుకొచ్చిన చట్టాలతో ఇబ్బందులు పెట్టడం సమంజసం కాదని, అటవీ అధికారులు హింసించడం మానుకోవాల న్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదవడానికి ఆసక్తి చూపిస్తున్న పుడు ప్రభుత్వం వాళ్ళకి సహకరించి ప్రభుత్వ పాఠ శాలల్లో సీట్లను పెంచాలని డిమాండ్ చేశారు. పిల్లలకు మెరుగైన విద్య అందించం దం ముఖ్యం, చదువే భవి ష్యత్తు నిర్మిస్తుంది కానీ ఇతర పనులు కాదని అన్నారు. గతంలో గిరిజనులతో కలకళ లాడిన ఐటీడీఏలు ఇప్పుడు కనీసం గెట్ వద్దకు కూడా ప్రజలురాక దివాలగా మారాయి. వాటికి నిధులు కేటాయించి అధికారం ఇవ్వాలని డిమాండ్ చేశా రు.ఈ సందర్భంగా మంత్రి దృష్టికి పలు కీలక అంశాల ను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తీసుకెళ్లారు. ఫారెస్టు అధి కారులు అమాయక గిరిజ నులను ఇబ్బందులు పెట్టడం మానుకో వాలని, ప్రభు త్వ పాఠశాల ల్లో సీట్లు పెంచి విద్యార్థుల భవిష్యత్తుకు స హకరించాలని,ఐటిడిఎను అభివృద్ధి చేసి వాటికి అధి కారం ఇవ్వాలని కోరారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నియోజకవర్గంలో గల బోర్లు, మోటర్ల సమస్యలు తీర్చాలని, ఎన్ ఎచ్ 44 జాతీయ రహదారిపై ఉండే నెరడిగొండ మండల కేంద్రంలోని ప్ర భుత్వ జూనియర్ కళాశాల అటవీశాఖ భూమి అని తిప్పలు పెట్టడం సరికాదని అన్నారు. పోడు పట్టాల రై తులకు ఇబ్బందులు పెట్టొ ద్దని అన్నారు.జంతువుల కోసం ఫ్లైఓవర్ బ్రిడ్జీలు నిర్మి స్తున్నారు కానీ గిరిజనుల పట్ల కనీసం కనికరించట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంకై 27న జిల్లా కేంద్రంలో మహాధర్నా గోడప్రతుల ఆవిష్కరణ టీఎస్‌యూటీఎఫ్ కార్యదర్శి పెంట అశోక్ పిలుపు



**ఖానాపూర్ ఆగస్టు 22 (ప్రజా జ్యోతి)**ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యల సాధన కోసం ఈ నెల 27న నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంట అశోక్ పిలుపునిచ్చారు. శనివారం ఖానాపూర్‌లోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల, గిరిజన బాలికల ఉన్నత పాఠశాల, మస్కాపూర్ ఉన్నత పాఠశాల, మైనారిటీ కాలేజీ ఇతర పాఠశాలలను సందర్శించి మాట్లాడారు. ఈ సందర్భంగా గోడపత్రికలను శనివారం పలువురు నాయకులతో కలిసి ఆవిష్కరించారు. గిరిజన సంక్షేమ శాఖలో పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తూ ఉపాధ్యాయులకు వెంటనే పదోన్నతులు కల్పించాలి. అప్‌గ్రేడ్ అయిన అన్ని గిరిజన సంక్షేమ,కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలకు అవసరమైన పోస్టులను తక్షణమే మంజూరు చేయాలన్నారు.ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం 2013 సున్నవారిగూడెం డిక్లరేషన్ ప్రకారం మిగిలిన హాస్టళ్లను ఆశ్రమ పాఠశాలలుగా కన్వర్ట్ చేసి, మంజూరు చేసిన 1506 పోస్టులకు ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వాలన్నారు.ట్రైబల్ ఎంఈవో, ట్రైబల్ డిప్యూటీ డీఈవో, పీవోఎండీ, ఎస్వోఎండీ తదితర పర్యవేక్షణ పోస్టులను భర్తీ చేయాలి.గిరిజన ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు స్కూల్ గ్రాంట్లు మంజూరు చేయడంతో పాటు కంప్యూటర్ ఫ్యాకల్టీ, ఏఎన్ఎం , స్కావెంజర్ పోస్టులను నియమించాలి. పెండింగ్‌లో ఉన్న డీఏ లను విడుదల చేసి, పీఆర్సీ సీపీఎస్ రద్దు అంశాలను వెంటనే పరిష్కరించాలి.

**పాల్గొన్న నాయకులు:**
ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంట అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు ఆకుల రాజేశ్వర్, కార్యదర్శులు పరాంకుశం మురళీధర్, షేక్ ఫైజల్ అహ్మద్, అంజయ్య, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నివాళి



**బోథ్, ఆగస్టు 22 (ప్రజా జ్యోతి)** ఇటీవల విద్యార్థుల చేతిలో అకాల మరణానికి గురైన ఉపాధ్యాయురాలు రూపా రెడ్డికి వాగ్దేవి విద్యాసంస్థల కరస్పాండెంట్, ప్రిన్సిపల్, అధ్యాపక బృందం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రాజశేఖర్ మాట్లాడుతూ, విద్యార్థులను తల్లిదండ్రులు క్రమశిక్షణ సంస్కారంతో పెంచాలని సూచించారు. ఉపాధ్యాయురాలు రూపా రెడ్డి అకాల మరణం అత్యంత విషాదకరమని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా భవిష్యత్తులో కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, మానవ తా విలువలు, గురువుల పట్ల గౌరవభావం పెంపొందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆర్. శ్రీనివాస్, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

## విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా సత్సంగ్ కార్యక్రమం



**సారంగాపూర్, ఆగస్టు 22, ప్రజా జ్యోతి** మండల కేంద్రం లో విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో సత్సంగ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిర్మల్ జిల్లా విశ్వ హిందూ పరిషత్ సభ్యులు మూర్తి ప్రభు, ముప్పిడి రవి, పతికే రాజేందర్, జెట్టి నరేందర్, మూర్తి అనిత హాజరై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సత్సంగ్ ద్వారా ఆధ్యాత్మికత, హిందూ ధర్మం, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కూనేరు భూమన్న, ఉప సర్పంచ్ అయిర కృష్ణారెడ్డి పాల్గొన్నారు. వివేకానంద పాఠశాల, వింధ్య పాఠశాల, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, మహిళలు, విశ్వ హిందూ పరిషత్ సారంగాపూర్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఏ ఐ ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా ముస్నిఫ్ ఎన్నిక



**బోథ్, ఆగస్టు 22 (ప్రజా జ్యోతి)** అదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ మహాసభ సమావేశంలో బోథ్ మండల కేంద్రానికి చెందిన ముస్నిఫ్‌ను నూతన జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లుగా తెలిపారు. జిల్లా సహాయ కార్యదర్శిగా పి సంతోష్ ఎన్నికైనట్టుగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముస్నిఫ్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి, విద్యార్థుల హక్కుల కోసం మరింత చురుకైన పాత్ర పోషించడానికి అవకాశం అని పేర్కొన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆదిలాబాద్ జిల్లాలో మరింత బలోపేతం అవుతుందని నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు.

## జాం ప్రాథమిక పాఠశాలలో ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం



**సారంగాపూర్, ఆగస్టు 22, ప్రజా జ్యోతి** జాం ప్రాథమిక పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రతి తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఏలేటి నర్సింహారెడ్డి గారి జ్ఞాపకార్థం ఆయన కుమార్తె లావణ్య దేవేందర్ రెడ్డి ఈ నగదు ప్రోత్సాహకాలను అందించారు. విద్యార్థుల్లో విద్యాపరమైన పోటీ తత్వాన్ని పెంపొందించడంతో పాటు, మరింత ఉన్నతంగా రాణించేందుకు ప్రోత్సాహం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాం సర్పంచ్ కరిపే రవళి విలాస్, ప్రధానోపాధ్యాయులు జనార్దన్, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వారు అభినందించారు.ం

## అక్రమ నీటి తరలింపును అరికట్టాలి



**బోథ్, ఆగస్టు 22 (ప్రజా జ్యోతి)** మండలంలోని కరత్వాడ ప్రాజెక్ట్ వద్ద అక్రమంగా గేట్లు ఎత్తి నీటిని తరలించడాన్ని అరికట్టి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఓ యువ రైతు తన బాధ ఆవేదనను నీటిపారుదల శాఖ అధికారులకు బోథ్ వాట్సప్ సమూహంగా తన గోడు గోసును వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా ఆ యువరైతు సోషల్ మీడియాలో అక్రమ నీటి తరలింపు రైతులు నష్టపోతున్న విధానాన్ని నీటిపారుదల శాఖ అధికారులు పరిశీలించాలని, వేడుకొన్నారు. ?ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా పంటలకు తాగునీటికి నీటి నిల్వలు చాలా అవసరమై ఉన్నవి. కానీ, ఈ పరిస్థితులను ఆసరాగా చేసుకుని కొంతమంది స్వార్థపరులు కరత్వాడ ప్రాజెక్ట్ వద్ద రాత్రి వేళల్లో అనుమతులు లేకుండా గేట్లు ఎత్తి నీటిని పక్కదోవ పట్టిస్తున్నట్లు గా పేర్కొన్నారు. దీనివల్ల ప్రాజెక్టులోని అమూల్యమైన నీరు వృథాగా పోవడమే కాకుండా, చివరి ఆయకట్టు రైతులకు తీవ్ర అన్యాయ ంం జరుగుతోంది.?కావున, వెంటనే అధికారులు స్పందించి కరత్వాడ ప్రాజెక్ట్ వద్ద తగిన భద్రతా చర్యలు చేపట్టా లని, అక్రమ నీటిని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకో వాలని, ప్రాజెక్ట్ నీరు వృథా కాకుండా కాపాడాలని కోరారు.

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ను సన్మానించిన మాజీ ఎంపీ



**ఆదిలాబాద్ బ్యూరో, ఆగస్టు 22, (ప్రజా జ్యోతి )** ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ లో ఏకరూప దుస్తులు, కిట్ల పంపిణీ కార్యక్రమానికి వచ్చి న రాష్ట్ర గిరిజన సంక్షేమ శా ఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ని మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సే వా సమితి రాష్ట్ర అధ్యక్షు డు సోయం బాపూరావు శా లువా కప్పి ఘణంగా సన్మా నించి సత్కరించారు. సో యం వెంట ఖానాపూర్ ఎ మ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మాజీ డిసిసిబీ చేర్మెన్ భోజ రెడ్డి, మార్కెట్ కమిటీ చేర్మె న్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, శ్రీలేఖ ఆదివాసీ, తదితరు లు ఉన్నారు.

## సోనాల హనుమాన్ ఆలయంలో శ్రావణ మాస భజనలు

**?సోనాల, ఆగస్టు 22 ( ప్రజాజ్యోతి )** సోనాల మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని మహిళా భక్తులు శ్రావణ మాస భజన కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం వేళ ఆలయ ప్రాంగణంలో మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీ ఆంజనేయ స్వామివారి నామస్మరణతో భజనలు నిర్వహించారు. భక్తిపాటలు, కీర్తనలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. స్వామివారి కృపతో అందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పు కృష్ణవేణి, బొమ్మెత భూమాబాయి, ఎరేకార్ గున్నబాయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం కళాకారులను ఆదుకోవాలి

**ఆదివాసి సకల కళ సంక్షేమ సంఘం డైరెక్టర్ కాత్లే శ్రీధర్**



**ఇచ్చోడ, ఆగస్టు 22, (ప్రజా జ్యోతి )** కళాకారులను అన్ని విధం గా ఆదుకోవాలని ఆదివాసి సకల కళా సంక్షేమ సంఘం డైరెక్టర్ కాత్లే శ్రీదర్ డిమాండ్ చేశారు. ఇచ్చోడ మండల కేంద్రంలో ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా క ళాకారులు నిరసన కార్యక్ర మం నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆదివాసి సకల క ళా సంక్షేమ సంఘం డైరెక్టర్ కాత్లే శ్రీధర్ మాట్లాడుతూ క ళాకారులందరికీ ప్రపంచ జా నపద దినోత్సవ శుభాకాంక్ష లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గత మూ డు సంవత్సరాలుగా నిర్వ హించిన వివిధ కార్యక్రమా లకు సంబంధించిన బిల్లులు ఇప్పటి కీ కళాకారులకు చెల్లించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కళాకారులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం వారికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు ఇప్పటి కైనా తెలంగాణ రాష్ట్ర ము ఖ్యమంత్రి, సాం స్కృతిక శాఖ మంత్రి స్పందించి, కళాకారులకు పెండిం గ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని, కళాకారు లను అన్ని విధాలుగా ఆదు కోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సకల కళా సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కాత్లే ఆనంద్, కళాకారులు జుగదిరావ్, కిరణ్, మనోహర్ తదితరులు పా ల్గొన్నారు.

# ఆదివాసి అడవి బిడ్డల గిరిజనుల సమస్యలు తీర్చేందుకు మంత్రి లక్ష్మణ్ కుమార్ కట్టుబడి ఉండాలి

## సమస్యలను నిలదీస్తే ఎమ్మెల్యే బొజ్జు పటేల్ను బదనాం చేస్తున్నారన్న ఆదివాసులు

### ఖానాపూర్ నియోజకవర్గ ఆదివాసి అడవి బిడ్డల గిరిజనుల విజ్ఞాపన

**ఖానాపూర్ ఆగస్టు 22 (ప్రజా జ్యోతి )** తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన హరిజన గిరిజన శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అధిక శాతం ఆదివాసీల అడవి బిడ్డలతో పాటు గిరిజనులు లంబాడాలు ఇతరత్రాలు  అనేక సమస్యలతో అనేక ఇబ్బందులతో ఉన్నారని ఈ సమస్యలు తీర్చడంలో మంత్రి చొరవ తీసుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వెనుకబడిన హరిజన గిరిజన ఆదివాసి లంబాడ తెగలు కోరుతున్నారు మంత్రి శనివారం ఖానాపూర్ నియోజకవర్గంలోని ఉట్నూర్ ప్రాంతంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న సందర్భంగా సంబంధిత ప్రజలు సమస్యల పరిష్కారం కోసం పలు వినతి పత్రాలను సమర్పించారు ముఖ్యంగా నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఖానాపూర్ శాసనసభ్యులు ఆదివాసి పోరు బిడ్డ వేడమ బొజ్జు పటేల్ ఆదివాసి అడవి బిడ్డల గిరిజనుల భూములతో పాటు పలు గూడాల్లో తండాల్లో అభివృద్ధి కోసం ఇసుక ఇతరత్రా వాటితో పాటు ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవడానికి అటవీశాఖ అధికారులు విధిస్తున్న కఠిన నిబంధనలను సడలించి ఆదివాసి గిరిజనుల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు టైగర్ జోన్ పేరా నానా ఇబ్బందులకు గురిచేస్తున్న అటవీశాఖ అధికారుల చర్యల్ని వ్యతిరేకిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ను బదనం చేస్తున్నారన్న సమస్యను మంత్రి లక్ష్మణ్ కుమార్ కు వివరించినట్లు తెలిసింది అటవీ అభివృద్ధిని అడవిని సంరక్షించే ఆ శాఖ అధికారులు కేవలం ఇసుకపై నిఘా వేసి అభివృద్ధి కార్యక్రమాలు గూడాల్లో తండాల్లో గ్రామాల్లో జరక్కుండా వేధిస్తున్నారని విషయాన్ని వివరించారు ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ముఖ్యంగా ఖానాపూర్ ఎస్టి నియోజకవర్గంలో అడుగడుగునా టైగర్ జోన్ పేరా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించి మంత్రి అటవీశాఖ అధికారులకు గిరిజన శాఖ మంత్రిగా ఆదివాసి గిరిజనులతో పాటు ఇతర తెగల లంబాడ ఇతరత్రా వారికి ఇబ్బందులు కలక్కుండా ఆదేశాలు జారీ చేయాలని కోరారు



# క్రమశిక్షణ, ఫిట్నెస్ పోలీస్ శాఖకు మూలాధారం వీక్లీ పరేడ్‌తో పోలీస్ సిబ్బందిలో శారీరక దృఢత్వం

ఆరోగ్య పరిరక్షణతోనే సమర్థవంతమైన విధినిర్వహణ

**వీక్లీ పరేడ్‌ను పరిశీలించిన పోలీస్ అధికారులు** ఖానాపూర్ ఆగస్టు 22 (ప్రజా జ్యోతి) నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ సబ్‌డివిజన్లు, సర్కిల్ పరిధుల్లోని పోలీస్ సిబ్బందికి శనివారం ఉదయం వీక్లీ పరేడ్ నిర్వహించారు. నిర్ణీత సమయానికి సిబ్బంది బేస్‌లైన్ ఫాలిన్‌లో పాల్గొని, అనంతరం పరేడ్ నిర్వహించారు. నిర్మల్ సబ్‌డివిజన్ పరిధిలో నిర్మల్ టౌన్ పోలీస్ స్టేషన్, నిర్మల్ రూరల్ సర్కిల్, సోన్ సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బందికి నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో వీక్లీ పరేడ్ నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాస్ పరేడ్‌ను నిర్వహించగా, సీఐ కృష్ణ, సీఐ గోవర్ధన్ రెడ్డి, ఎస్ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**భైంసా సబ్‌డివిజన్ పరిధిలోలి**

భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని పోలీస్ సిబ్బందికి భైంసా టౌన్ పోలీస్ స్టేషన్‌లో వీక్లీ పరేడ్ నిర్వహించారు. భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ఐపీఎస్ పరేడ్‌ను నిర్వహించి సిబ్బంది ప్రదర్శించిన డ్రిల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సీఐలు, ఎస్ఐలు  పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**ఖానాపూర్ సర్కిల్ పరిధిలో..**

ఖానాపూర్ సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బందికి ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో వీక్లీ పరేడ్ ని సీఐ కటకంసత్యనారాయణ పరేడ్‌ను నిర్వహించగా, ఎస్ఐలుపోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. వీక్లీ పరేడ్ ద్వారా పోలీస్ సిబ్బందిలో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, సమన్వయం పెంపొందుతాయని



తెలిపారు. విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండేందుకు శారీరక, మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. విధుల మధ్య సమయం దొరికినప్పుడల్లా వ్యాయామం చేయడం, ఫిట్నెస్‌ను నిరంతరం కాపాడుకోవడం ద్వారా మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తించవచ్చున్నారు. పోలీసులు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకొని, చెడు వ్యసనాలు  చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా వ్యక్తిగత, ఆరోగ్య లేదా విధులకు సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాయామాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవడంతో పాటు కుటుంబ సభ్యులతో సమయం గడుపుతూ మానసిక ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని అధికారులు సూచించారు. వీక్లీ పరేడ్‌లో ఎ ఆర్ , డిసిఆర్బి ఐటి కోర్ ఎస్ బి పి సి ఆర్ షీ టీం భరోసా తదితర విభాగాల సిబ్బంది పాల్గొని పరేడ్, డ్రిల్ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు.

## సోనాల హనుమాన్ ఆలయంలో శ్రావణ మాస భజనలు

**సోనాల, ఆగస్టు 22 ( ప్రజాజ్యోతి ):** సోనాల మండల కేంద్రం లోని హనుమాన్ ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్క రించుకుని  మహిళా భక్తులు శ్రావణ మాస భజన కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం వేళ ఆలయ ప్రాంగణంలో మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీ ఆంజనేయ స్వామివారి నామస్మరణతో భజనలు నిర్వహించారు. భక్తిపాటలు, కీర్తనలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. స్వామివారి కృప తో అందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని ప్రత్యే క ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పు కృష్ణవేణి, బొమ్మె త భూమాబాయి, ఎరేకార్ గున్నబాయ్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే రేఖా నాయక్ పరామర్శలు ఆర్థిక సహాయం



**ఖానాపూర్ ఆగస్టు 22 (ప్రజా జ్యోతి)** ఖానాపూర్ మండలంలోని ఇక్బాల్ పూర్ గ్రామానికి చెందిన మాలవతు లక్ష్మణ్ ఇటీవలమృతి చెందారు విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అజ్మీర రేఖ శ్యామ్ నాయక్ ఆగిరిజన కుటుంబాన్ని పమార్శించి ఆర్థిక సహా యం అందజేశారు ఇలా మండలంలోని కొన్ని కుటుంబాలను పరామర్శించి వారికి ధైర్యాన్ని నూరి పోశారు

## చరవాణి సంకేతాల గురించి బిఎస్ఎన్ఎల్ ఆఫీసర్ ని కలిసిన దహెగావ్ గ్రామస్తులు



**ఆదిలాబాద్ టౌన్ జూలై 22 ( ప్రజా జ్యోతి )** అదిలాబాద్ జిల్లా బేల మండలం దహెగావ్ గ్రామంలో మొబైల్ సంకేతాలు రాక ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. బేల మండలానికి ఆనుకొని మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న దహెగావ్ గ్రామం లో మొబైల్ కు ఏ నెట్వర్క్ పనిచేయదు. బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ గురించి శనివారం గ్రామ సర్పంచ్ బొక్రె శంకర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆదిలాబాద్ లో బిఎస్ఎన్ఎల్ మేనేజర్ బాపూరావు కి వారి సమస్యను వివరించారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించి పై అధికారులకు తెలిపి గ్రామంలో బిఎస్ఎన్ఎల్ టవర్ నుత్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. అందుకు కృతజ్ఞతగా సర్పంచ్ గ్రామస్తులు అధికారికి అభినందనలు తెలిపారు. సర్పంచ్ వెంట  ఉప సర్పంచ్ మున్నా, నిక్కం దత్తా, మడావి చంద్రకాంత్, ప్రభాకర్, బోయర్ ప్రమోద్,మహేంద్ర, అరవింద్ తదితరులు ఉన్నారు.

# రూపా రెడ్డి ఘటన ఒక హెచ్చరిక.. ఉపాధ్యాయుల భద్రతకు ఇకనైనా భరోసా కావాలి






**సారంగాపూర్, ఆగస్టు 22,ప్రజా జ్యోతి** ముండల విలాస్, ఉపాధ్యా యుడు, సామాజిక కార్యకర్త, నిర్మల్ జిల్లా విద్యా సమాజాన్ని కలచివేసిన విషాదం విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే పవిత్రమైన బాధ్యతలో ఉపాధ్యాయులు నిరంతరం నిమగ్నమై ఉంటారు. పాఠశాల అనేది కేవలం విద్యను అందించే ప్రదేశం మాత్రమే కాదు పిల్లలకు విలువలు, క్రమశిక్షణ, బాధ్యత, మానవత్వం నేర్పించే ఆలయం. అలాంటి విద్యా రంగంలో పనిచేస్తున్న ఒక ప్రిన్సిపాల్ శ్రీమతి కె. రూపా రెడ్డి విషాదకర హత్య ఘటన విద్యా సమాజాన్ని తీవ్రంగా కలచివేసింది.

**ఉపాధ్యాయుల భద్రతపై ప్రశ్నలు**

ఒక ఉపాధ్యాయురాలు, ఒక ప్రిన్సిపాల్‌గా తన బాధ్యతలను నిర్వర్తిస్తున్న సమయంలో ఇలాంటి విషాదం చోటుచేసుకోవడం అత్యంత ఆందోళనకరం. ఈ ఘటనపై ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఇది కేవలం ఒక కుటుంబానికి జరిగిన విషాదం కాదు.. విద్యా రంగంలో పనిచేస్తున్న వేలాది మంది ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, సిబ్బందిలో భద్రతపై ప్రశ్నలను లేవనెత్తుతున్న ఘటన.

**గౌరవంతో పాటు భద్రత కూడా అవసరం**

ఉపాధ్యాయులకు సమాజంలో ఎంతో గౌరవం ఉంది. అయితే గౌరవంతో పాటు వారి భద్రతకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలి. పాఠశాలల్లో విధులు నిర్వహించే సమయంలో ఉపాధ్యాయులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ఉండే వాతావరణాన్ని కల్పించడం అత్యవసరం.ఒక ఉపాధ్యాయుడిగా ఈ ఘటన గురించి తెలుసుకున్నప్పుడు నాకు చాలా బాధ కలిగింది. మనం ప్రతిరోజూ పిల్లల భవిష్యత్తు కోసం పనిచేస్తున్నాం. అలాంటి సమయంలో మన భద్రత గురించి కూడా ఆలోచించాల్సిన పరిస్థితి రావడం నిజంగా ఆందోళన కలిగించే విషయం.

**ప్రైవేట్ విద్యా రంగంలోనూ రక్షణ అవసరం**

ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ అనేక బాధ్యతలను నిర్వహిస్తున్నారు. విద్యార్థుల విద్యాభ్యాసం నుంచి వారి క్రమశిక్షణ వరకు, తల్లిదండ్రులతో సమన్వయం నుంచి పాఠశాల నిర్వహణ వరకు అనేక బాధ్యతలు వారిపై ఉంటాయి. ఈ బాధ్యతలను నిర్వర్తించే వారికి అవసరమైన భద్రతా వ్యవస్థ కూడా ఉండాలి.

**నిష్పక్షపాత విచారణతోనే న్యాయం**

రూపా రెడ్డి ఘటనపై నిష్పక్షపాతంగా, సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలి. ఘటనకు బాధ్యులెవరైనా చట్ట ప్రకారం కఠినంగా చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పాఠశాలల్లో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలి.

**పాఠశాలల్లో భద్రతా చర్యలు బలోపేతం చేయాలి**

పాఠశాలల్లో అవసరమైన చోట సీసీ కెమెరాలు, అత్యవసర సంప్రదింపు వ్యవస్థలు, భద్రతా సిబ్బంది, ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే విధానం వంటి చర్యలను పటిష్టం చేయాలి. ఉపాధ్యాయులు ఏదైనా సమస్యను ఎదుర్కొన్నప్పుడు సంబంధిత అధికారులను సులభంగా సంప్రదించగలిగే వ్యవస్థ ఉండాలి.

**యాజమాన్యాల బాధ్యత కూడా కీలకం**

అంతేకాదు, పాఠశాల యాజమాన్యాలు కూడా తమ సిబ్బంది భద్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఉపాధ్యాయులపై బాధ్యతలు అప్పగించడం మాత్రమే కాకుండా, ఆ బాధ్యతలను సురక్షితంగా నిర్వర్తించేందుకు అవసరమైన సహకారం, రక్షణ కల్పించాలి.

**రూపా రెడ్డి కుటుంబానికి అండగా నిలవాలి**

రూపా రెడ్డి గారి కుటుంబం అనుభవిస్తున్న బాధను మాటల్లో చెప్పడం సాధ్యం కాదు. ఈ సమయంలో వారి కుటుంబానికి విద్యా సమాజం మొత్తం అండగా నిలవాలి. వారి కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.

**విషాదం కాదు.. ఒక హెచ్చరికగా తీసుకోవాలి**

ఈ ఘటనను ఒక విషాదంగా మాత్రమే మిగిల్చకుండా, ఒక హెచ్చరికగా తీసుకోవాలి. ఉపాధ్యాయుల భద్రతపై ఇప్పటికైనా సమగ్ర చర్చ జరగాలి. పాఠశాలలో పిల్లలకు భద్రత కల్పించే ముందు, వారిని తీర్చిదిద్దే ఉపాధ్యాయుడికి కూడా భద్రత ఉందనే నమ్మకాన్ని కల్పించాలి.

**ఉపాధ్యాయుడి భద్రతే విద్యా వ్యవస్థకు భద్రత**

ఉపాధ్యాయుడి భద్రత అంటే విద్యా వ్యవస్థకు భద్రత. విద్యా వ్యవస్థకు భద్రత అంటే సమాజ భవిష్యత్తుకు భద్రత. రూపా రెడ్డి గారి ఘటనకు న్యాయం జరగాలి. ఇలాంటి ఘటన మరో ఉపాధ్యాయుడికి, మరో కుటుంబానికి ఎప్పటికీ ఎదురుకాకూడదు. అదే ఆమెకు మనం అందించే నిజమైన నివాళి.

## శ్రీరాంపూర్ కాలనీ వాటర్ ట్యాంక్ ఏరియా పోచమ్మ దేవాలయంలో ఘనంగా గణపతి హోమం



**మంచిర్యాల, 22 ఆగస్టు (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ కాలనీ వాటర్ ట్యాంక్ ఏరియాలోని పోచమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా శనివారం గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ గౌరవ అధ్యక్షుడు, కార్పొరేటర్ బండారి సుధాకర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు అర్కాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు కొనసాగాయి. వేద పండితులు బుడి అరుణ్ శర్మ, బుడి అనుదీప్ శర్మ, సుబ్బ అభిషేక్ శర్మ, వేదాంతు సచిన్ శర్మ, గణేష్ శర్మల ఆధ్వర్యంలో శాంతిపాఠం, గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, నవగ్రహ పూజలు, జలాధివాసం, గణపతి హోమం తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం 9 గంటలకు మహిళలచే సామూహిక కుంకుమార్చనలు, గణపతి పూజ, గర్తవాసం, బీజన్యాసం, మండపార్చన, మూలమంత్రంతో కన్యా లగ్నంలో శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పునఃప్రతిష్ఠాపన అనంతరం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించవచ్చని పేర్కొన్నారు. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

## ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డుకు భూమిపూజ

**అభివృద్ధి పనులకు పెద్దపీట: ఆత్రం సుగుణక్క**



**ఆసిఫాబాద్, ఆగస్టు 22 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ మండలం అంకుసాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క శనివారం భూమిపూజ చేశారు. కాలనీలో రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు ఆమె తెలిపారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే కాలనీ ప్రజలకు రాకపోకలకు మెరుగైన సౌకర్యం కలుగుతుందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని సుగుణక్క పేర్కొన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ టేకం గంగారం, ఉప సర్పంచ్ దుర్గం లక్ష్మి, డీసీసీ ఉపాధ్యక్షుడు తారీక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాపర్తి మురళి, గ్రామ పెద్దలు రేగుంట కేశవ్, జంగపల్లి శేఖర్, పోల్కర్ రామచందర్, దుర్గం లింగయ్య, దుర్గం సంజీవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాము, యూత్ కాంగ్రెస్ నాయకుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు



## విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**డి ఇ వెంకటేశ్వర్లు**

**లక్ష్మణ చాంద, ఆగస్టు 20 (ప్రజా జ్యోతి)** వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిర్మల్ జిల్లా ఐజు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం రోజున చామనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.ప్రజలు తెగిపోయిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సర్వీస్ వైర్లను తాకరాదని సూచించించారు. విద్యుత్ స్తంభాలకు పశువులను కట్టకూడదని, విద్యుత్ పరికరాల సమీపంలో నిర్మాణ పనులు చేసేటప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపోవడం లేదా ఇతర ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తే వెంటనే 1912 టోల్ ఫ్రీనంబర్‌కు లేదా సమీప విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అయిట్ల లక్ష్మీ సుదర్శన్, ఉప సర్పంచ్ ఏలేటి గంగారెడ్డి, ఏఈ మహేష్, కొమ్మోజి రమణ, రమేష్, లైన్ మెన్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ సమస్యను వెంటనే పరిష్కరించాలి




: డీవైఎఫ్ఐ



**జాబ్ క్యాలెండర్ హామీలను అమలు చేయాలి: కోట రమేష్**


**ఆసిఫాబాద్, ఆగస్టు 22 ప్రజా జ్యోతి** నిరుద్యోగ సమస్యను వెంటనే పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని రోజ్‌గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన డీవైఎఫ్ఐ నాలుగో జిల్లా మహాసభల్లో ఆయన మాట్లాడారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులతో పాటు పోలీస్, డీఎస్సీ, జేఎల్, డీఎల్, గ్రూప్-1, 2, 3, 4 తదితర పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలకు తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేసి నియామకాలు చేపట్టాలని అన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే వరకు నిరుద్యోగులకు నెలకు రూ.5 వేల భృతి అందించాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని, రాజీవ్ యువ వికాస్ పథకాన్ని వెంటనే ప్రారంభించాలని కోరారు. స్థానిక పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే వారిని 'దిమాక్ నక్సలైట్లు' అంటూ ముద్ర వేయడం అప్రజాస్వామికమని పేర్కొంటూ, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును గౌరవించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గెడం టికానంద్, కార్యదర్శి గోడిసెల కార్తీక్, ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్, పురుషోత్తం, సహాయక కార్యదర్శి సతీష్, జిల్లా కమిటీ సభ్యులు మంజుల, సవిత, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# మూడు నెలల రేషన్ బియ్యం ఎప్పుడిస్తారో..?

నెల కావస్తున్నా రేషన్ బియ్యం సరఫరా లేదు..

ప్రజల్లో అయోమయం

డీలర్‌ను అడిగితే.. "బియ్యం ఇంకా రావాల్సి ఉంది" అంటూ సమాధానం




**ఆసిఫాబాద్ ఆర్సీ,ఆగస్టు23 (ప్రజాజ్యోతి):** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం సరండి గ్రామపంచాయతీ పరిధిలో రేషన్ బియ్యం కోసం లబ్ధిదారులు తీవ్రంగా ఎదురుచూస్తున్నారు. మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి అందుతుందని భావించిన ప్రజలకు ప్రస్తుతం ఎదురుచూపులే మిగిలాయి. నెల కావస్తున్నా రేషన్ బియ్యం సరఫరా కాకపోవడంతో పేద కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సాధారణంగా ప్రతి నెలా రేషన్ దుకాణం ద్వారా బియ్యం తీసుకునే లబ్ధిదారులు.. ఈసారి మాత్రం బియ్యం ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. డీలర్‌ను అడగగా బియ్యం ఇంకా రావాల్సి ఉంది.. వచ్చిన తర్వాత పంపిణీ చేస్తాం అని సమాధానం ఇస్తున్నట్లు తెలిపారు.

**నెల గడుస్తున్నా.. స్పష్టత ఏదీ?**

ఒకవైపు నెల రోజులు గడిచిపోతున్నా.. మరోవైపు బియ్యం సరఫరాపై అధికారులు, సంబంధిత శాఖ నుంచి స్పష్టమైన సమాచారం లేకపోవడం ప్రజల్లో అసంతృప్తికి కారణమవుతోంది. రేషన్ బియ్యం ఎప్పుడు వస్తుంది? ఎప్పుడు పంపిణీ చేస్తారు? అనే విషయంపై లబ్ధిదారులకు స్పష్టత లేకపోవడంతో రోజూ రేషన్ దుకాణం వైపు చూస్తున్న పరిస్థితి ఏర్పడింది. పేద కుటుంబాలకు ఇబ్బందులు గ్రామీణ ప్రాంతాల్లో అనేక కుటుంబాలు ప్రభుత్వ రేషన్ బియ్యంపైనే ఆధారపడుతున్నాయి. నెలకు రావాల్సిన బియ్యం ఆలస్యం అయితే ఇంటి ఖర్చులపై ప్రభావం పడుతుందని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా కూలి పనులపై ఆధారపడే కుటుంబాలకు రేషన్ బియ్యం అందుబాటులో ఉండటం ఎంతో అవసరమని చెబుతున్నారు.

**అధికారులు స్పందించాలి**

సరండి గ్రామంలో రేషన్ బియ్యం సరఫరా ఎందుకు ఆలస్యం అవుతోంది? మండల స్థాయి నుంచి బియ్యం కేటాయింపు జరిగిందా? రేషన్ దుకాణానికి బియ్యం ఎప్పుడు చేరుతుంది? అనే అంశాలపై సంబంధిత పౌరసరఫరాల శాఖ అధికారులు స్పష్టత ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు. మూడు నెలల బియ్యం ఒకేసారి ఇస్తారనే సమాచారం నేపథ్యంలో.. లబ్ధిదారులు మరింత అయోమయానికి గురవుతున్నారని, బియ్యం సరఫరాపై వెంటనే స్పష్టమైన ప్రకటన చేసి, ఆలస్యం లేకుండా పంపిణీ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గ్రామస్థుల ఎదురుచూపులకు తెరదించి రేషన్ బియ్యం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం 27న మహా ధర్నా

## అన్ని వర్గాల ఉద్యోగులు, భాగస్వామ్య సంఘాలు సహకరించి మహా ధర్నాను విజయవంతం చేయాలి

**మంచిర్యాల జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి**



**మంచిర్యాల, 22 ఆగస్టు (ప్రజాజ్యోతి):** ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న ఉదయం 11 గంటల నుంచి నస్పూర్‌లోని ఐడీఓసీ వద్ద నిర్వహించనున్న మహా ధర్నాకు అనుమతి కోరుతూ టీజేఏసీ మంచిర్యాల జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి, సెక్రటరీ జనరల్ కే. వనజారెడ్డి జిల్లా కలెక్టర్, ఏసీపీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గడియారం శ్రీహరి ఉద్యోగుల సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం టీజేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్‌రావు, రాష్ట్ర కార్యవర్గం తీసుకున్న నిర్ణయం మేరకు, అలాగే మంచిర్యాల జిల్లాలోని అన్ని వర్గాల ఉద్యోగుల అభీష్టం మేరకు ఈ మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 27న ఉదయం 11 గంటల నుంచి నస్పూర్ ఐడీఓసీ వద్ద అన్ని భాగస్వామ్య సంఘాల ఆధ్వర్యంలో మహా ధర్నా శాంతియుతంగా నిర్వహించనున్నట్లు గడియారం శ్రీహరి పేర్కొన్నారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం టీజేఏసీ చేపడుతున్న కార్యక్రమానికి అన్ని వర్గాల ఉద్యోగులు, భాగస్వామ్య సంఘాలు సహకరించి మహా ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ 'ఉద్యోగుల గొంతుక' పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీజేఏసీ నాయకులు శ్రీనివాస్ దేశ్‌పాండే, అత్తె సుధాకర్, పొన్న మల్లయ్య, శ్రీపతి బాపురావు, శ్రవణ్‌కుమార్, గోపాల్ రాంకుమార్, తిరుపతి, నడిమెట్ల సత్యనారాయణ, ఎండీ యూసఫ్, రాజేందర్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ పోలీసుల భద్రతకు రిఫ్లెక్టివ్ బెల్ట్‌ల పంపిణీ

**రాత్రి వేళల్లో విధులు నిర్వహించే సిబ్బంది భద్రతకు ప్రత్యేక చర్యలు**

**పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా**



**మంచిర్యాల, 22 ఆగస్టు (ప్రజాజ్యోతి):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా రహదారులపై విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి రిఫ్లెక్టివ్ బెల్ట్‌లు, బాడీ బెల్ట్‌లు, రాత్రి వేళల్లో సిబ్బంది స్పష్టంగా కనిపించేలా ఉపయోగపడే భద్రతా పరికరాలను పంపిణీ చేశారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో చౌరస్తాలు, ప్రధాన రహదారులపై విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసు సిబ్బంది వాహనదారులకు స్పష్టంగా కనిపించేందుకు రిఫ్లెక్టివ్ పరికరాలు ఎంతో ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. రాత్రి సమయంలో రహదారులపై విధులు నిర్వహించే సిబ్బంది ప్రమాదాలకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో భాగంగానే ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. విధుల నిర్వహణలో పోలీసు సిబ్బంది భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణలో అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు రహదారి భద్రతా నిబంధనలను పాటిస్తూ విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ట్రాఫిక్ పోలీసుల భద్రతతో పాటు వాహనదారులు, ప్రజల రక్షణను దృష్టిలో ఉంచుకుని అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు . ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు, ఆర్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# భారత అంతరిక్ష విజయాలు దేశానికి గర్వకారణం

## తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ పత్తి సునీత

**మంచిర్యాల, 22 ఆగస్టు (ప్రజాజ్యోతి):** భారతదేశం అంతరిక్ష పరిశోధన రంగంలో సాధించిన చారిత్రాత్మక విజయాలు దేశానికి గర్వకారణమని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ పత్తి సునీత అన్నారు. విద్యార్థినుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని, పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించేందుకు అంతరిక్ష పరిశోధనలపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమని అన్నారు. కళాశాలలో ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఆగస్టు 22న నిర్వహించిన జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్యంగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఫిజిక్స్ విభాగం అధ్యాపకులు, విద్యార్థినులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. 2023 ఆగస్టు 23న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టిన చంద్రయాన్-3 మిషన్ చంద్రుని దక్షిణ ధ్రువంపై విజయవంతంగా ల్యాండ్ అయి చరిత్ర సృష్టించిన ఘట్టానికి గుర్తుగా ప్రతి సంవత్సరం ఆగస్టు 23న దేశవ్యాప్తంగా జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ విజయంతో భారతదేశం అంతరిక్ష పరిశోధన రంగంలో తన సత్తాను ప్రపంచానికి చాటిందన్నారు. చంద్రయాన్-3 వంటి ప్రతిష్టాత్మక మిషన్లు విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తిని పెంపొందించేందుకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని డాక్టర్ పత్తి సునీత తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీసీ, ఎంపీసీఎస్ విభాగాలకు చెందిన విద్యార్థినులు అంతరిక్ష సాంకేతికత, ఇస్రో సాధించిన కీలక మైలురాళ్లు, వివిధ ప్రతిష్టాత్మక అంతరిక్ష ప్రాజెక్టులు, చంద్రయాన్-3 మిషన్ ప్రాధాన్యత తదితర అంశాలపై అద్భుతమైన ప్రసంగాలు చేశారు. అంతరిక్ష రంగంలో భారతదేశం సాధించిన ప్రగతిని వివరించడంతో పాటు విద్యార్థినులు తమలోని ప్రతిభను



చాటుకున్నారు. ఎంపీసీఎస్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు కె. నందిని, జి. అంజలి భౌతికశాస్త్రంలోని సంక్లిష్టమైన 'టైమ్ డైలేషన్' అంశంపై ప్రదర్శించిన సైన్స్ నాటిక కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. క్లిష్టమైన శాస్త్రీయ అంశాన్ని సులభంగా అర్థమయ్యే రీతిలో నాటిక రూపంలో ప్రదర్శించడంతో విద్యార్థులు, అధ్యాపకులు ఆసక్తిగా వీక్షించి అభినందించారు. ఫిజిక్స్ విభాగాధిపతి రిజ్వానా బేగం అంతరిక్ష సాంకేతికతలోని మెళకువలను, ఇస్రో సాధించిన విజయాలను, జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించుకోవడం వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశాన్ని విద్యార్థినులకు వివరించారు. అంతరిక్ష పరిశోధనల ద్వారా దేశానికి కలిగే ప్రయోజనాలు, భవిష్యత్‌లో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కె. సరిత, లైబ్రేరియన్ డాక్టర్ ఎన్. పద్మరాణి, మ్యాగజైన్ కోఆర్డినేటర్ డాక్టర్ బి. సంధ్యారాణితో పాటు ఫిజిక్స్ విభాగం అధ్యాపకులు, ఇతర అధ్యాపకులు, ఎంపీసీ, ఎంపీసీఎస్ విభాగాల విద్యార్థినులు పాల్గొన్నారు. విద్యార్థినులలో శాస్త్రీయ ఆసక్తిని పెంపొందించేలా నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## అజయ్ కుమార్ జన్మదిన వేడుకల్లో బీఆర్ఎస్ శ్రేణుల సందడి

### ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అజయ్ కుమార్ సేవలు




**ఆసిఫాబాద్ , ఆగస్టు 22:ల ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ వాంకిడి మండల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ అజయ్ కుమార్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి అజయ్ కుమార్‌కు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అజయ్ కుమార్ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న ప్రజా నాయకుడని అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తున్నారని కొనియాడారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న అజయ్ కుమార్ సేవలను అభినందించారు. ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించి మరింతగా ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# వార్డు సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

**ఆసిఫాబాద్ ఆర్సీ, (ప్రజాజ్యోతి): ఆగస్టు 22** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం సరండి గ్రామపంచాయతీ పరిధిలోని వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని వార్డు సభ్యులు రమాదేవి, మహేశ్వరి తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత కల్పిస్తూ, ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే వరకు ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. గ్రామపంచాయతీలో ప్రజలకు మౌలిక వసతులు ఎంతో అవసరమని, ముఖ్యంగా తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ, అంతర్గత రహదారులు, వీధి దీపాలు, కాలువల శుభ్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటికి తగిన పరిష్కార మార్గాలను అన్వేషిస్తామని చెప్పారు.

**ప్రజల సమస్యలకు ప్రాధాన్యత**

వార్డుల్లో ఏ సమస్య ఉన్నా ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని రమాదేవి, మహేశ్వరి కోరారు. చిన్న సమస్యగా భావించి నిర్లక్ష్యం చేయకుండా, ప్రజలకు ఇబ్బంది కలిగించే ప్రతి అంశాన్ని పంచాయతీ సమావేశాల్లో ప్రస్తావించి అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అవసరమైన చోట సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాకాలంలో డ్రైనేజీలు, కాలువలు సక్రమంగా లేకపోవడం వల్ల ఇళ్ల చుట్టూ నీరు నిలిచే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని, అందువల్ల ముందస్తుగా కాలువల శుభ్రత, మురుగు నీటి పారుదల, పరిసరాల పరిశుభ్రతపై చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. గ్రామంలో పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడేలా పంచాయతీ సిబ్బందితో సమన్వయం చేసుకుంటామని తెలిపారు.

**మౌలిక వసతులపై దృష్టి**

వార్డుల్లో అవసరమైన చోట రహదారుల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు, తాగునీటి సమస్యల పరిష్కారం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను కోరనున్నట్లు తెలిపారు. ప్రజలకు రాత్రి వేళల్లో ఇబ్బందులు లేకుండా వీధి దీపాలు పనిచేసేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా ప్రజా అవసరాలకు సంబంధించిన సమస్యలను గుర్తించి, అందుబాటులో ఉన్న ప్రభుత్వ నిధులు, పంచాయతీ వనరులను సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి పనులు చేపట్టేలా కృషి చేస్తామని చెప్పారు. అందరితో సమన్వయంతో ముందుకు గ్రామపంచాయతీ అభివృద్ధి ఒక్కరి వల్ల సాధ్యం కాదని, సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, అధికారులు, ప్రజలు అందరూ కలిసి పనిచేసినప్పుడే గ్రామం అభివృద్ధి చెందుతుందని రమాదేవి, మహేశ్వరి పేర్కొన్నారు. వ్యక్తిగత విభేదాలకు తావులేకుండా ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యత కల్పిస్తూ అభివృద్ధి పనులు చేపట్టేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తెలియజేస్తే వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు.

**ప్రజల నమ్మకమే బలం**

వార్డు సభ్యులుగా తమపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని




నిలబెట్టుకోవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని రమాదేవి, మహేశ్వరి అన్నారు. పదవిని కేవలం బాధ్యతగా కాకుండా ప్రజలకు సేవ చేసే అవకాశంగా భావిస్తున్నామని తెలిపారు. గ్రామంలోని ప్రతి కుటుంబానికి అవసరమైన మౌలిక సదుపాయాలు అందేలా, వార్డుల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించే దిశగా ముందుకు సాగుతామని చెప్పారు. ప్రజల సహకారం, అధికారుల సమన్వయంతో సరండి గ్రామపంచాయతీని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.ప్రజల సమస్యలను విని వదిలేయడం కాదు.. పరిష్కారం కోసం నిరంతరం ప్రయత్నించడమే మా బాధ్యత. వార్డుల అభివృద్ధికి అందరినీ కలుపుకొని ముందుకు సాగుతాం అని వార్డు సభ్యులు రమాదేవి, మహేశ్వరి తెలిపారు.

# రక్త దాతలే నిజమైన హీరోలు

**-సినీ నటుడు ఆర్ ఎస్ నంద**

**మంచిర్యాల ప్రతినిధి ఆగస్టు 22 ప్రజా జ్యోతి** ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తం అందించి పునర్జన్మ ప్రసాదించే రక్తదాతలు నిజమైన హీరోలనీ సినీ నటుడు, దర్శకుడు ఆర్ ఎస్ నంద పేర్కొన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోనీ రక్త నిధి కేంద్రం లో మెగా రక్త దాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని రక్త దాన శిబిరం ప్రారంబించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేము కాబట్టి, తోటి మనిషిని ఆదుకోవడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చే ప్రతి దాత సమాజంలో గొప్ప కథానాయకుడని కితాబిచ్చారు.. ఉన్నత చదువులు చదువుకుని సినీ రంగం పై ఉన్న మక్కువతో చిన్న సినిమాలు తీస్తున్నానన్నారు. ఇప్పటివరకు 200వందలకు పైగా లఘు చిత్రాలకు దర్శకత్వం, రచన చేసి ప్రజల ఆధారాబిమానాలు చూరగొనడం సంతృప్తి నిస్తుందన్నారు. అనంతరం ఆసుపత్రి లో రోగులకు, తలసేమియా వ్యాధిగ్రస్తులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆంధ్రజ్యోతి జర్నలిస్ట్ జనార్దన్ మాట్లాడుతూ రక్త దానం చేస్తున్నామన్న ఆహ్వానించ గానే రావడం,అభినదనీయమని,ఆటోస్



సామాజిక బాధ్యత ప్రతి ఒక్కరూ తోటి వారికి సాయ పడాలని అన్నారు.రెడ్ క్రాస్ సంస్థ నిర్వాక అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఒకరి రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడుతుంద న్నారు. ప్రమాద బాధితులకు, శస్త్రచికిత్సలు జరిగే వారికి రక్తం ఎంతో ముఖ్యమనీ,.కులమతాలకు అతీతంగా మానవత్వాన్ని చాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేడ్ల శ్రీనివాస్,నేరెళ్ల రమేశ్, ముషం రాజమల్లు, సుధాకర్, బద్రి మహేష్,సాయి,కార్ల శ్రీనివాస్, నూతి వేణు గోపాల్, సాగర్, కృష్ణ,సత్యం, లక్మణ్, విజయ్, బోస్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప సర్పంచ్ సంతకం చేసేనా..?

**సర్పంచ్--కార్యదర్శి మౌనం ఎందుకు..?**




**ఆసిఫాబాద్ ఆర్సీ,(ప్రజాజ్యోతి): ఆగస్టు 22** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మేజర్ గ్రామపంచాయతీలో ఓ చెక్కు వ్యవహారం ఇప్పుడు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తోంది. చెక్కుపై సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి సంతకాలు పూర్తయ్యాయని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో.. ఉప సర్పంచ్ సంతకం విషయంలో మాత్రం స్పష్టత లేకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. సర్పంచ్, కార్యదర్శి సంతకాలు పూర్తయిన తర్వాత కూడా చెక్కు ప్రక్రియ ఎందుకు ముందుకు సాగడం లేదన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ఉప సర్పంచ్ సంతకం తప్పనిసరా..? తప్పనిసరి అయితే ఆయన ఎందుకు సంతకం చేయడం లేదు..? ఒకవేళ తప్పనిసరి కాకపోతే ఈ వ్యవహారంపై ఇంత చర్చ ఎందుకు జరుగుతోంది..? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

**సంతకాలు పూర్తయ్యాయంటే.. మిగిలింది ఏమిటి?**

పంచాయతీ నిధులకు సంబంధించిన ప్రతి లావాదేవీపై ప్రజలకు స్పష్టత ఉండాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ప్రజా నిధులతో చేపట్టే పనులు, వాటికి సంబంధించిన బిల్లులు, చెక్కులు, చెల్లింపుల విషయంలో పారదర్శకత ఉండాలని ప్రజలు కోరుతున్నారు. సర్పంచ్, కార్యదర్శి సంతకాలు పూర్తయ్యాయని చెబుతున్న సమయంలో సంబంధిత చెక్కు ఏ పనికి సంబంధించినది? దాని విలువ ఎంత? ఎవరి పేరుతో జారీ చేయబడింది? చెల్లింపు ప్రక్రియ ఏ దశలో ఉంది? వంటి వివరాలను పంచాయతీ పాలకవర్గం వెల్లడించాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

**మీడియా ముందుకు ఎందుకు రావడం లేదు..?**

ఈ వ్యవహారంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నప్పటికీ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి మీడియా ముందుకు వచ్చి తమ వివరణ ఇవ్వకపోవడం కూడా చర్చనీయాంశంగా మారింది. వివాదం లేకపోతే అసలు పరిస్థితిని ప్రజలకు వివరించడానికి ఇబ్బంది ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.సంతకాలు అయ్యాయా? అయితే ప్రక్రియ ఏంటి? ఉప సర్పంచ్ సంతకం అవసరమా? అవసరం లేకపోతే ఎందుకు ప్రస్తావన వస్తోంది? అనే అంశాలపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

**పాలకవర్గంలో అంతర్గత విభేదాలా..?**

ఇటీవల వాంకిడి మేజర్ గ్రామపంచాయతీలో పాలకవర్గం మధ్య వివిధ అంశాలపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయనే చర్చ కూడా స్థానికంగా వినిపిస్తోంది. ఈ చెక్కు వ్యవహారం కూడా అంతర్గత విభేదాలకు సంబంధించినదేనా? లేక కేవలం పరిపాలనా ప్రక్రియలో ఏర్పడిన సమస్యనా? అన్నది తెలియాల్సి ఉంది. అయితే ఆధారాలు లేకుండా ఎవరిపైనా ఆరోపణలు చేయకుండా, సంబంధిత పత్రాలు మరియు అధికారిక వివరాల ఆధారంగా వాస్తవాలను బయటపెట్టాల్సిన అవసరం ఉంది.

**అసలు నిబంధన ఏంటి..?**

ఉప సర్పంచ్ సంతకం తప్పనిసరిగా అవసరమా లేదా అన్న విషయంపై సంబంధిత పంచాయతీ అధికారులు, ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామపంచాయతీ ఆర్థిక వ్యవహారాల్లో ఎవరి సంతకం ఏ సందర్భంలో అవసరం, చెల్లింపు ప్రక్రియ ఎలా కొనసాగుతుంది అనే విషయాలను బహిరంగంగా వెల్లడిస్తే అనుమానాలకు తావుండదని అంటున్నారు. అలాగే చెక్కు సంబంధిత ఫైల్‌లో ఉన్న ప్రతిపాదన, తీర్మానం, బిల్లులు, సంతకాల వివరాలు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అన్నదీ పరిశీలించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నా రు.ప్రజలకు సమాధానం కావాలి గ్రామపంచాయతీ నిధులు ప్రజలకు సంబంధించినవే కావడంతో, వాటి వినియోగంపై ప్రజలకు తెలుసుకునే హక్కు ఉందని స్థానికులు చెబుతున్నారు. చెక్కు వ్యవహారంపై అనవసర అనుమానాలు పెరగకుండా సర్పంచ్, కార్యదర్శి, ఉప సర్పంచ్ తమ తమ వైఖరిని స్పష్టం చేయాలని కోరుతున్నారు. ముఖ్యంగా సర్పంచ్, కార్యదర్శి సంతకాలు పూర్తయ్యాయని చెబుతున్నప్పుడు.. ఉప సర్పంచ్ సంతకం ఎందుకు పెండింగ్‌లో ఉంది? పెండింగ్‌లో ఉంటే కారణం ఏమిటి? చెక్కు ఎప్పుడు విడుదల కానుంది? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది.ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు కూడా పూర్తి స్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం ప్రక్రియ జరుగుతోందా లేదా అన్నదానిపై స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. వాంకిడి మేజర్ గ్రామపంచాయతీలో చెక్కు వ్యవహారం రోజురోజుకూ చర్చనీయాంశంగా మారుతున్న నేపథ్యంలో.. సర్పంచ్, కార్యదర్శి మౌనం వీడి వాస్తవాలను వెల్లడిస్తారా..? ఉప సర్పంచ్ సంతకం చేస్తారా..? లేక ఈ వ్యవహారం మరింత మలుపు తిరుగుతుందా..? అనేది వేచి చూడాల్సిందే.

## అంకుసాపూర్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందించడమే లక్ష్యం: ఆత్రం సుగుణక్క**



**ఆసిఫాబాద్, ఆగస్టు 22 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ మండలం అంకుసాపూర్ గ్రామంలో శనివారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తోంద న్నారు. కొత్త రేషన్ కార్డులు వాటర్‌ప్రూఫ్‌తో పాటు పలు భద్రతా ఫీచర్లు, క్యూఆర్ కోడ్‌తో రూపొందించారని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. సన్నబియ్యం పథకం ద్వారా పేదలకు నాణ్యమైన బియ్యం అందిస్తున్నామని పేర్కొన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ టేకం గంగారం, ఉప సర్పంచ్ దుర్గం లక్ష్మి, డీసీసీ ఉపాధ్యక్షుడు తారిక్, ఆసిఫాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రావుర్తి మురళి, జీపీవో సరోజన, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మేడిగడ్డ బ్యారేజ్ 7వ బ్లాక్‌లో కాంక్రీట్ నాణ్యత డొల్ల.. తేల్చేసిన సీడబ్ల్యూపీఆర్ఎస్ నివేదిక

**హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ నాణ్యతపై మరో విస్మయకర అంశం వెలుగులోకి వచ్చింది. రెండేళ్ల క్రితం కుంగిపోయిన బ్యారేజీలోని 7వ బ్లాక్‌లో కాంక్రీట్ నాణ్యత అత్యంత పేలవంగా ఉన్నట్లు పుణేకు చెందిన సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) తన నివేదికలో స్పష్టం చేసింది. బ్యారేజీ పునరుద్ధరణ పనుల అంచనాలో భాగంగా నిర్వహించిన వివిధ పరీక్షల్లో ఈ చేదు నిజం వెల్లడైంది.సీడబ్ల్యూపీఆర్ఎస్ నిర్వహించిన అల్ట్రాసోనిక్ పల్స్ వెలాసిటీ, రీబౌండ్ హ్యామర్ పరీక్షల్లో 7వ బ్లాక్‌లోని 16 నుంచి 21వ సంఖ్య గల పియర్‌లలో కాంక్రీట్ నాణ్యత అత్యంత తక్కువగా లేదా అనుమానాస్పదంగా ఉన్నట్లు తేలింది. ముఖ్యంగా పియర్-19లో గరిష్ఠంగా 73.3 శాతం, పియర్-18లో 65.5 శాతం, పియర్-20లో 61.1 శాతం మేర నాణ్యత లోపాలు ఉన్నట్లు నివేదిక పేర్కొంది. నిర్మాణంలో నాణ్యత లోపించడం, నీటి ప్రవాహ ఉద్ధృతికి కాంక్రీట్‌లో ఖాళీలు ఏర్పడటమే 2023లో ఈ బ్లాక్ కుంగిపోవడానికి ప్రధాన కారణమై ఉండవచ్చని నిపుణులు అభిప్రాయపడ్డారు.ఈ నేపథ్యంలో, 7వ బ్లాక్ పునరుద్ధరణకు సంబంధించి మరిన్ని లోతైన పరిశీలనలు, అదనపు పరీక్షలు నిర్వహించాలని సీడబ్ల్యూపీఆర్ఎస్ సిఫార్సు చేసింది.

## సెప్టెంబర్ నాటికి గోదావరి జలాలు

**విశాఖపట్టణం :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుస్థిర పారిశ్రామికాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, సురక్షిత తాగునీరు సరఫరాలను సమతుల్యం చేస్తూ కూటమి ప్రభుత్వం సువర్ణ అధ్యాయానికి చుట్టబోతున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల దాహార్తిని తీరుస్తూ, రాబోయే సెప్టెంబర్ మొదటి వారంలో అనకాపల్లి, విశాఖ పట్నం జిల్లాలకు పవిత్ర గోదావరి జలాలు రప్పిస్తామని అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం అనకాపల్లి జిల్లా కే. కోటపాడు మండలం ఏ కోడూరు గ్రామంలో నిర్వహించిన బహిరంగ ప్రజావేదిక సభలో

# చార్జిషీట్ నుంచి తీర్పు వరకు టైమ్‌లైన్‌పై ప్రత్యేక దృష్టి

**మంచి పని చేయండి.. టైమ్‌లైన్‌ను పాటించండి..**

**టీమ్‌వర్క్‌తోనే న్యాయపరమైన విజయాలు సాధించగలం**

**రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా**





**మంచిర్యాల, 22 ఆగస్టు (ప్రజాజ్యోతి):** కేసుల దర్యాప్తు నుంచి చార్జిషీట్ దాఖలు, కోర్టు విచారణ, సాక్షుల హాజరు, తుది తీర్పు వరకు ప్రతి దశలో నిర్ణీత కాలపరిమితిని ఖచ్చితంగా పాటించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అధికారులను ఆదేశించారు. నేరస్తులకు శిక్షలు పడటంలో కోర్టు డ్యూటీ, కోర్టు లైజనింగ్ పోలీస్ అధికారుల పాత్ర కీలకమని ఆయన అన్నారు. సీపీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో కోర్టు డ్యూటీ, కోర్టు లైజనింగ్ పోలీస్ అధికారులతో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీపీ మాట్లాడారు. కేసుల దర్యాప్తు, చార్జిషీట్ దాఖలు, కోర్టు విచారణ, సాక్షుల హాజరు తదితర ప్రతి అంశంలో నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. చార్జిషీట్ దాఖలుకు ముందు కోర్టు డ్యూటీ అధికారులు సీడీ ఫైల్‌తో పాటు సంబంధిత పత్రాలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని తెలిపారు. విచారణకు వచ్చే ముఖ్యమైన కేసులను ముందుగానే గుర్తించి సంబంధిత ఎస్‌హెచ్‌ఓలకు సమాచారం అందించడంతో పాటు సాక్షులను ట్రయల్‌కు ముందే సమగ్రంగా బ్రీఫింగ్ చేయాలని ఆదేశించారు. ఏపీపీలు, పీపీలు, కోర్టు లైజనింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ సాక్షులను విచారణ సమయంలో కోర్టులో హాజరుపరచాలని తెలిపారు. సమన్లు, వారెంట్లు, సీసీడీల వివరాలను ఎప్పటికప్పుడు సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేసి నవీకరించాలని, తీర్పు కాపీలు అందిన వెంటనే వాటిని సీసీటీఎన్ఎస్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కోర్టు రికార్డులు, పోలీస్‌స్టేషన్ రికార్డుల్లోని నాన్‌బెయిలబుల్ వారెంట్ల సంఖ్య ఒకే విధంగా ఉండేలా ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని అన్నారు. సంచలనాత్మక కేసుల ట్రయల్ షెడ్యూల్‌ను ఉన్నతాధికారులకు ముందుగానే తెలియజేయాలని, సాక్షులు, నిందితుల హాజరుకు అవసరమైన చోట ఈ-సమన్లు జారీ చేసేలా మేజిస్ట్రేట్లను కోరాలని సూచించారు. ఈ-సంతకం చేసిన ఎఫ్ఐఆర్‌లను స్వీకరించేలా మేజిస్ట్రేట్లతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. నిందితులకు తప్పనిసరిగా శిక్ష పడే విధంగా పకడ్బందీగా దర్యాప్తు చేపట్టి, బలమైన సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టాలని సీపీ అన్నారు. కేసుల దర్యాప్తు లేదా కోర్టు విచారణలో ఏ దశలోనైనా అనవసర జాప్యం జరిగితే దాని ప్రభావం చివరకు పోలీసుశాఖపైనే పడుతుందని స్పష్టం చేశారు. కేసులను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేయడం వల్ల న్యాయ ప్రక్రియ బలహీనపడే అవకాశం ఉందని, ప్రతి కేసు పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత టైమ్‌లైన్‌లో పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీస్ శాఖ బృంద లక్ష్యాలు, నిర్దిష్ట గమ్యాల సాధన దిశగా పనిచేసే వ్యవస్థ అని సీపీ అన్నారు. వ్యక్తిగత ప్రతిభతో పాటు ప్రతి అధికారి అందించే కృషి మొత్తం బృందం విజయానికి దోహదపడాలని, అందరూ ఒకే దిశలో, ఒకే లక్ష్యంతో పనిచేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అన్నారు. న్యాయం జరిగే కోర్టు ప్రాంగణంలో అవినీతికి ఎలాంటి స్థానం ఉండకూడదని, విధుల నిర్వహణలో ప్రతి ఒక్కరూ నిజాయితీ, పారదర్శకతను పాటించాలని సూచించారు. గత రెండు, మూడు నెలలుగా కోర్టు కేసుల పర్యవేక్షణలో గణనీయమైన పురోగతి సాధించామని, అదే స్థాయిని కొనసాగించేందుకు మరింత క్రమశిక్షణ, పట్టుదలతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయపరమైన విజయాలు ఏ ఒక్క అధికారి సాధించినవి కావని, దర్యాప్తు అధికారులు, కోర్టు డ్యూటీ సిబ్బంది, పోలీస్‌స్టేషన్ సిబ్బంది, పర్యవేక్షణ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసినప్పుడే కేసుల్లో విజయవంతమైన ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. "మంచి పని చేయండి.. టైమ్‌లైన్‌ను పాటించండి.. బాధ్యతలను ముందుగానే అంచనా వేసుకుని పనిచేయండి. టీమ్‌వర్క్‌తోనే న్యాయపరమైన విజయాలు సాధించగలం" అని సీపీ అంబర్ కిశోర్ ఝా స్పష్టం చేశారు. సిబ్బందికి వృత్తిపరంగా లేదా వ్యక్తిగతంగా ఏవైనా సమస్యలు ఉన్నా నేరుగా తనను సంప్రదించవచ్చని తెలిపారు. సమర్థవంతంగా పనిచేసే సిబ్బందికి తగిన గుర్తింపు, ప్రోత్సాహకాలు తప్పకుండా ఉంటాయని తెలిపారు . పలు కేసుల్లో నిందితులకు శిక్షలు పడటంలో కీలక పాత్ర పోషించిన కోర్టు డ్యూటీ సిబ్బంది, కోర్టు లైజనింగ్ అధికారులను సీపీ శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, వర్టికల్ ఇన్‌చార్జి, తాండూర్ సీఐ దేవయ్య, లైజనింగ్ ఆఫీసర్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్లు అనిల్ కుమార్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్, ఎస్ఐ వినీత, ఐటీ కోర్ ఎస్ఐ సంతోష్, సీసీ సందీప్, కోర్టు డ్యూటీ సిబ్బంది, కోర్టు లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ నీళ్లు కరువు.. సోలార్ ట్యాంక్‌తో ఇంద్రానగర్ ప్రజల అవస్థలు

**హ్యాండ్‌పంప్ తొలగించడంతో తాగునీటి కష్టాలు..! ట్యాంక్ నీటి నాణ్యతపై గ్రామస్తుల ఆందోళన**

**ఆసిఫాబాద్ ఆర్సీ,ఆగస్టు 22 (ప్రజాజ్యోతి):** ఆసిఫాబాద్,వాంకిడి మండలం బంబారా గ్రామపంచాయతీ పరిధిలోని ఇంద్రానగర్, గోండు కొసరా ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొన్నదని స్థానికులు చెబుతున్నారు. ఇంద్రానగర్ వాసులకు గతంలో తాగునీటికి ప్రధాన ఆధారంగా ఉన్న హ్యాండ్‌పంప్‌ను తొలగించి, దాని స్థానంలో సోలార్ ట్యాంక్ ద్వారా నీటి సరఫరా ఏర్పాటు చేశారు. అయితే సోలార్ ట్యాంక్ నిర్వహణ, పరిశుభ్రతపై సరైన శ్రద్ధ లేకపోవడంతో నీటి నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్యాంక్‌లోని నీటిని వినియోగిస్తున్న కొందరికి అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు ఒక్క హ్యాండ్‌పంప్.. దానినీ తొలగించడంతో ఇబ్బందులు ఇంద్రానగర్‌లో ప్రజల తాగునీటి అవసరాలకు ఒకే హ్యాండ్‌పంప్ అందుబాటులో ఉండేదని స్థానికులు తెలిపారు. మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా లేకపోయినా ఆ హ్యాండ్‌పంప్ ద్వారా ప్రజలకు కొంత ఉపశమనం లభించేదని చెబుతున్నారు. అయితే హ్యాండ్‌పంప్‌ను తొలగించి సోలార్ ట్యాంక్ కనెక్షన్ ఇవ్వడంతో ప్రత్యామ్నాయ నీటి వనరు లేకుండా పోయిందని వాపోతున్నారు.

**గోండు కొసరాలోనూ నీటి కష్టాలు**

గోండు కొసరా ప్రాంతంలో కూడా మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు పేర్కొన్నారు. వేసవి కాలంలో మాదిరిగానే ప్రస్తుతం కూడా నీటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోందని, సంబంధిత అధికారులు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతున్నారు.

**హ్యాండ్‌పంప్ పునరుద్ధరించాలని డిమాండ్**

సోలార్ ట్యాంక్ నిర్వహణను మెరుగుపరచడంతో పాటు నీటి నాణ్యతపై అధికారులు పరీక్షలు నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ముఖ్యంగా ఇంద్రానగర్‌లో తొలగించిన హ్యాండ్‌పంప్‌ను తిరిగి బిగించి ప్రజలకు ప్రత్యామ్నాయ తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా పూర్తిస్థాయిలో అందే వరకు హ్యాండ్‌పంప్‌ను అందుబాటులో ఉంచాలని, సోలార్ ట్యాంక్‌ను క్రమం తప్పకుండా శుభ్రపరచి సురక్షితమైన నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరాను పునరుద్ధరించి, తొలగించిన హ్యాండ్‌పంప్‌ను తిరిగి ఏర్పాటు చేసి



ఇంద్రానగర్, గోండు కొసరా ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# 2వ వార్డు అభివృద్ధికి రమాదేవి ప్రత్యేక చొరవ

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా

ముందుకు.. వార్డు ప్రజల ప్రశంసలు

**ఆసిఫాబాద్ ఆర్సీ,ఆగస్టు 22 (ప్రజాజ్యోతి):** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం సరండి గ్రామపంచాయతీ పరిధిలోని 2వ వార్డు అభివృద్ధికి వార్డు సభ్యురాలు రమాదేవి ప్రత్యేక చొరవ చూపుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. వార్డులో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ వాటి పరిష్కారానికి గ్రామపంచాయతీ పాలకవర్గం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారని తెలిపారు. వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, పారిశుధ్యం, రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు వంటి అంశాలపై రమాదేవి దృష్టి సారిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడం, గ్రామపంచాయతీ సమావేశాల్లో వాటిని ప్రస్తావించడం ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై.. అభివృద్ధి వైపు అడుగులు వార్డు సభ్యురాలిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి రమాదేవి ప్రజలతో మమేకమై పనిచేస్తున్నారని స్థానికులు అంటున్నారు. వార్డులో ఏ సమస్య తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలని, సాధ్యమైనంత త్వరగా సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆమె చెబుతున్నట్లు తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే చిన్న సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, అభివృద్ధి పనుల పురోగతిని తెలుసుకోవడం వంటి చర్యలు చేపడుతున్నారని స్థానికులు ప్రశంసిస్తున్నారు. వార్డు అభివృద్ధి విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న రమాదేవికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. మరిన్ని అభివృద్ధి పనులపై ఆశలు రానున్న రోజుల్లో 2వ



వార్డులో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. రహదారులు, పారిశుధ్యం, డ్రైనేజీ, వీధి దీపాలు తదితర మౌలిక వసతులను మరింత మెరుగుపరిస్తే వార్డు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు. ప్రజల సహకారంతో 2వ వార్డును మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడమే తన లక్ష్యమని రమాదేవి పేర్కొన్నట్లు స్థానికులు తెలిపారు. వార్డు ప్రజల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాలని ఆమె చేస్తున్న ప్రయత్నాలను పలువురు అభినందిస్తున్నారు.

## టిఆర్ఎస్ పార్టీ గ్రామ, బూత్ ఇన్‌చార్జ్ ల నియమకం



**కాసిపేట,ఆగస్టు 22(ప్రజాజ్యోతి)** తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ఆదేశాల మేరకు ,జిల్లా ఇన్‌చార్జీ ఉదరి చంద్రమోహన్ గౌడ్, బెల్లంపల్లి నియోజక వర్గ ఇన్‌చార్జ్ బోడా జనార్ధన్ సుచానలతో కాసిపేట మండల ఇంచార్జి సోదరి సురేష్ అధ్వార్యంలో కోమటి చెను గ్రామ, బూత్ ఇన్‌చార్జీ నియమకశీ జరిగింది. గ్రామ ఇన్‌చార్జా కుమ్మరి వరలక్ష్మి, 26 బూత్ ఇన్‌చార్జీ గా రత్నం వంశీ ,20 బూత్ ఇన్‌చార్జీ గా బడ్డీ సంతోష్ గెడమ్ లక్ష్మణ్, 21బూత్ ఇన్‌చార్జ్ లుగా నియమకశీ అయ్యారాని తెలిపారు. ఈ సందర్భంగా సోదరి సురేష్ మాట్లాడుతు గ్రామ సమస్యల పరిష్క రశీ కోసం, అభివృద్ధి కోరాకు యువత ముంధు ఉండలాని అన్నారు.ఈ కార్యక్రమం లో మండల నాయకులు గంగా దరి రాజ్‌కుమార్,కుమ్మరి అఖిల పార్టీ నాయకులు గ్రామ పెద్ద మనుషులు పాల్గొన్నారు..

# పారిశుద్ధ్య పనులపై అసంతృప్తి.. వత్తాసు వెనుక అసలు కథేంటి?

**ఆసిఫాబాద్ ఆర్సీ, ఆగస్టు22 (ప్రజాజ్యోతి):** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం సరండి గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య పనుల నిర్వహణపై గ్రామస్థుల అసంతృప్తి నెలకొంది. సరండి గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య పనుల నిర్వహణపై ఇటీవల జరిగిన గ్రామ సభలో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. గ్రామంలో పారిశుద్ధ్య పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదని, జీపీ కార్మికుడు సంజీవ్ తనకు అనుకూలంగా, ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారంటూ కొందరు గ్రామస్థులు సభలో అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. గ్రామంలోని ప్రతి వార్డులో సమానంగా పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సి ఉండగా, కొన్ని ప్రాంతాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారనే అభిప్రాయాలు ప్రజల్లో వ్యక్తమైనట్లు సమాచారం. మురుగు కాలువలు, చెత్త తొలగింపు, వీధుల పరిశు భ్రత వంటి అంశాల్లో నిరంతర పర్యవేక్షణ అవసరమని గ్రామస్థులు పేర్కొన్నట్లు తెలుస్తోంది.

**గ్రామ సభలో ప్రశ్నలు.. బయట వ్యక్తి వత్తాసు?**

ప్రజలు సంజీవ్ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్న సమయంలో నార్లాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ముందుకు వచ్చి ఆయనకు వత్తాసు పలుకుతూ మాట్లాడటం ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గ్రామపంచాయతీకి సంబంధించిన సమస్యపై సరండి గ్రామస్థులు ప్రశ్నిస్తుంటే, నార్లాపూర్‌కు చెందిన వ్యక్తి ఎందుకు జోక్యం చేసుకోవాల్సి వచ్చిందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.ప్రజలు తమ సమస్యలను గ్రామ సభలో ప్రస్తావించడం సహజమేనని, వారి అభ్యంతరాలకు పంచాయతీ అధికారులు సమాధానం ఇవ్వాల్సి ఉంటుందని పలువురు అంటున్నారు. అయితే ఒక ఉద్యోగి లేదా జీపీ కార్మికుడి పనితీరుపై ప్రజలు ప్రశ్నించిన సందర్భంలో బయటి వ్యక్తి సమర్థిస్తూ మాట్లాడటం వెనుక కారణమేంటనే చర్చ మొదలైంది.

**అసలు సంబంధం ఏమిటి?**

నార్లాపూర్‌కు చెందిన ఆ వ్యక్తికి సరండి గ్రామపంచాయతీ పారిశుద్ధ్య పనులతో ఏమైనా సంబంధం ఉందా? సంజీవ్‌కు ఆయన ఎందుకు మద్దతుగా నిలిచారు? గ్రామస్థులు లేవనెత్తిన అభ్యంతరాలను పక్కన పెట్టి వ్యక్తిగతంగా వత్తాసు పలకాల్సిన అవసరం ఏమొచ్చింది? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో గ్రామ సభలో ప్రజలు వ్యక్తం చేసిన అసంతృప్తిని పంచాయతీ పాలకవర్గం, అధికారులు ఎలా తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. ప్రజల ఆరోపణల్లో వాస్తవమెంత, పారిశుద్ధ్య పనులు వాస్తవంగా ఎలా జరుగుతున్నాయి అనే విషయాలపై క్షేత్రస్థాయి లో పరిశీలన చేస్తేనే పూర్తి వాస్తవాలు బయటపడే అవకాశం ఉంది.

**పంచాయతీ పర్యవేక్షణ ఎక్కడ?**

గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరిగేలా సంబంధిత అధికారులు, పాలకవర్గం పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉంది. కార్మికులు తమకు కేటాయించిన పనులను సక్రమంగా నిర్వహిస్తున్నారా? ప్రతి వార్డులో పారిశుద్ధ్య పనులు సమానంగా జరుగుతున్నాయా? చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారా? మురుగు కాలువల పరిస్థితి ఎలా ఉంది? అనే అంశాలపై అధికారులు పరిశీలన చేయాల్సిన అవసరం ఉందని గ్రామస్థులు కోరుతున్నారు. పారిశుద్ధ్య పనులపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేసినప్పుడు వ్యక్తుల మధ్య వాదోపవాదాలకు తావివ్వకుండా, సమస్యను అధికారికంగా పరిశీలించి పరిష్కరించడమే సరైన మార్గమని పలువురు అభిప్రాయపడుతున్నారు. గ్రామ సభలో లేవనెత్తిన ప్రశ్నలకు సమాధా నం ఎప్పుడు? గ్రామ సభ అనేది ప్రజల సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లే వేదిక. అలాంటి వేదికపై పారిశు ద్ధ్య పనులపై వచ్చిన అభ్యంతరాలను పంచాయతీ రికార్డు చేసి, సంబంధిత కార్మికుడి పనితీరును పరిశీలించి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది.అయితే సమస్యపై స్పష్టత రావాల్సిన సమయంలో బయట వ్యక్తి జోక్యం చేసుకోవడం ఇప్పుడు



కొత్త చర్చకు కారణమైంది. ప్రజలు ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సింది ఎవరు? సమస్యను పరిష్కరించాల్సింది ఎవరు? బయటి వ్యక్తులు ఎందుకు ముందుకు వస్తున్నారు? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

**రాజకీయ రంగు పులుముకుంటుందా?**

ఇప్పటికే సరండి గ్రామపంచాయతీలో వివిధ అంశాలపై పాలకవర్గం, వార్డు సభ్యులు, గ్రామస్థుల మధ్య చర్చలు జరుగుతున్న నేపథ్యంలో పారిశుద్ధ్య పనుల వ్యవహారం కూడా మరో వివాదానికి దారితీసే పరిస్థితి కనిపిస్తోందని స్థానికులు అంటున్నారు. ఒక సాధారణ పారిశుద్ధ్య సమస్యకు వ్యక్తుల మద్దతు, వ్యతిరేకతలు జతకావడం వల్ల అసలు సమస్య పక్కదారి పట్టే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజలు కోరేది ఒక్కటే--- గ్రామం పరిశుభ్రంగా ఉండాలి, ప్రతి వార్డులో సమానంగా పారిశు ద్ధ్య పనులు జరగాలి. దీనిపై పంచాయతీ యంత్రాంగం స్పష్టమైన చర్యలు తీసుకుంటే వివాదాలకు తెరపడే అవకాశం ఉంది. సంజీవ్ పనితీరుపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవమెంత? గ్రామ సభలో ప్రజలు వ్యక్తం చేసిన అసంతృప్తిపై పంచాయతీ ఏం చర్యలు తీసుకోనుంది? నార్లాపూర్‌కు చెందిన వ్యక్తి ఎందుకు వత్తాసుగా నిలిచారు? ఈ వ్యవహారంలో ఇంకా ఎవరెవరి పాత్ర ఉంది? అనే ప్రశ్నలకు అధికారిక వివరణ రావాల్సి ఉంది.

# టీకానపల్లి గ్రామంలో పోలీస్ కళాబృందం అవగాహన కార్యక్రమం

**డ్రగ్స్, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు సూచనలు**



**మంచిర్యాల, 22, ఆగస్టు (ప్రజా జ్యోతి):** రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ పర్యవేక్షణలో, మంచిర్యాల రూరల్ సీఐ రవీందర్, ఎస్ఐ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో టీకానపల్లి గ్రామంలో పోలీస్ కళాబృందంతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, రహదారి భద్రత, సైబర్ నేరాల నివారణ, అత్యవసర సమయాల్లో డయల్ 112 సేవలను వినియోగించు కోవడం వంటి అంశాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్ఐ కిరణ్ కుమార్ మాట్లాడుతూ, యువత గంజాయి, డ్రగ్స్, మద్యం, సిగరెట్లు వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలకు బానిసలుగా మారకుండా ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగి తల్లిదండ్రు లకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లక్కీ డ్రా వచ్చిందని లేదా ఓటీపీ చెప్పాలని ఫోన్ చేసే మోసగాళ్ల మాటలను నమ్మవద్దని హెచ్చరించారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ వంటి కీలక సమాచారాన్ని ఎవరికీ వెల్లడించరాదని సూచించారు.గ్రామాల్లో దొంగతనాలు, ఇతర నేరాల నివారణకు ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ సూచించారు. మూఢనమ్మకాల పేరుతో జరిగే మోసాలకు గురికా కుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆర్థికంగా, శారీరకంగా నష్టపోయే పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గంజాయి విక్రయించే వారు లేదా వినియోగించే వారి గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.అదేవిధంగా డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు దూరంగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాల నంబర్ ప్లేట్లలో ఎలాంటి మార్పులు చేయరాదని తెలిపారు. రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం వల్ల ఈ–చలాన్ల ద్వారా జరిమానాలు విధించబడతాయని హెచ్చరించారు.అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రజలు వెంటనే డయల్ 112కు సమాచారం అందించి పోలీసుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో నేరాల నియంత్రణ కు ప్రజలు పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు, మాదకద్రవ్యాల విక్రయాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాజీపూర్ ఎస్ఐ కిరణ్ కుమార్, పోలీసు సిబ్బంది టీకానపల్లి గ్రామ ప్రజలు, యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఇస్రో పరిశోధన, అత్యాధునిక సాంకేతికతలపై దృష్టి

**శ్రీహరికోట :** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)లో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇకపై లాంచ్ వెహికల్స్ తయారీ, సాధారణ శాటిలైట్ల తయారీ వంటి కార్యకలాపాల నుంచి ఇస్రో క్రమంగా తప్పుకోనుంది. ఈ బాధ్యతలను ప్రైవేట్ సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలకు అప్పగించనుంది. ఇస్రో పరిశోధన, అత్యాధునిక సాంకేతికత అభివృద్ధి, శాస్త్రీయ ప్రయోగాలు, ప్రత్యేక మిషన్లపై మరింత దృష్టి పెట్టనుంది.ఎకానమీ సమ్మిట్‌లో ఇన్‌స్పేస్ చైర్మన్ డాక్టర్ పవన్ గోయెంకా ఈ విషయాన్ని వెల్లడించారు. “ఇస్రో ఇకపై ఎలాంటి లాంచ్ వెహికల్స్‌ను తయారు చేయదు. వాటి తయారీని ప్రైవేట్ రంగం లేదా ప్రభుత్వ రంగ సంస్థలు చేపడతాయి” అని ఆయన తెలిపారు.ఈ మార్పు ఇప్పటికే ప్రారంభమైంది. చిన్న ఉపగ్రహాలను ప్రయోగించే స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్వీ) సాంకేతికత, ఉత్పత్తి హక్కులను బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)కు బదిలీ చేశారు.తదుపరి దశలో భారత్ ప్రధాన రాకెట్లైన పీఎస్ఎల్వీ (పీఎస్ఎల్వీ), ఎల్వీఎం–3 (ఎల్వీఎం3) సాంకేతికత, తయారీ కూడా ప్రైవేట్ రంగానికి బదిలీ చేసే దిశగా చర్యలు సాగుతున్నాయి. అయితే ఈసారి ప్రభుత్వ రంగ సంస్థలకు బదులుగా ప్రైవేట్ పరిశ్రమలకే అవకాశం కల్పించనున్నట్లు గోయెంకా తెలిపారు.ఇకపై ఇస్రో ఒక తయారీ సంస్థగా కాకుండా ప్రధానంగా పరిశోధన, అభివృద్ధి సంస్థగా పనిచేయనుంది. కొత్త సాంకేతికతలు, శాస్త్రీయ మిషన్లు, ప్రత్యేక ఉపగ్రహాలు, అధునాతన అంతరిక్ష మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టి సారించనుంది.ఒక సాంకేతికత అభివృద్ధి చెంది వాణిజ్యపరంగా వినియోగించేందుకు సిద్ధమైన తర్వాత దానిని ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేస్తామని గోయెంకా చెప్పారు. ఇప్పటివరకు ఇస్రోకు చెందిన 120 సాంకేతికతలను ప్రైవేట్ రంగానికి బదిలీ చేసినట్లు ఆయన వెల్లడించారు.ప్రభుత్వం నిర్మిస్తున్న కొత్త లాంచ్ సెంటర్ నిర్వహణ బాధ్యతలను కూడా ప్రైవేట్ రంగానికి అప్పగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనికి సంబంధించిన ఆపరేటర్‌ను వచ్చే నాలుగు లేదా ఐదు నెలల్లో ఖరారు చేసే అవకాశం ఉందని గోయెంకా తెలిపారు.బ

# ప్రవక్త హజ్రత్ మహమ్మద్ ముస్తఫా అల్లల్లాహు అలైహి వసల్లం జయంతి వేడుకలుబి జష్నే ఈద్ మిలాద్ ఉన్ నబీ పండగను పురస్కరించుకొని

**సిర్పూర్(టి) యువత ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం,ఏర్పాటు చేసి పేషెంట్లకు పండ్లు పంపిణీ**

**రక్తదానమే మహాదానం అన్ని దానాల కంటే రక్తదానం గొప్పది.రక్త దానం చేయడం వల్ల ఇంకొకరి ప్రాణాలను రక్షించవచ్చు:బిబి**

**ముఖ్యఅతిథిగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన సిర్పూర్ (టి) సామాజిక ఆసుపత్రి సుప్రిండెంట్ డాక్టర్ జోగేందర్:బి**

**అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి ఉపయోగపడాలని సదుద్దేశంతో రక్తదానం చేసాం యువకులు:బి**

**కుల మతాలకు అతీతంగా హిందూబి ముస్లిం యువకులు 50 మంది రక్తదానం చేసి మానవత్వాన్ని చాటారు**

**జన్నైధార బ్లడ్ బ్యాంక్ సిబ్బంది శిబిరానికి హాజరై రక్తాన్ని సేకరించి యువకులను అభినందించారు:బి**

**ఆగస్టు 22,సిర్పూర్(టి) కానిస్టేన్సీ కరస్పాండెంట్ ప్రజా జ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కానిస్టేన్సీ హెడ్ కోటర్ 001 సిర్పూర్(టి) మండల కేంద్రంలో ప్రవక్త హజరత్ మహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం జయంతి వేడుకల సందర్భంలో నెలరోజుల పాటు నిర్వహించే జష్నే ఈద్ ములాదున్ నబీ పండగను పురస్కరించు కొని అట్టి సందర్భంలో సిర్పూర్ (టి) యువకుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరానికి సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి సుప్రిండెంట్ డాక్టర్ జోగేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని యువకులతో కలిసి రిబ్బన్ కట్ చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రిలో అడ్మిట్ అయి ఉన్న పేషెంట్లకు పండ్లు పంపిణీ చేశారు.డాక్టర్ జోగేందర్ యువకులతో కలిసి మాట్లాడుతూ... రక్తదానం గొప్ప కార్యక్రమం అని యువకులను అభినందించారు. రక్త దానం చేయడం వల్ల ఇంకొకరి ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. అన్ని దానాల కంటే రక్తదానం గొప్పదని అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి ఉపయోగపడుతుందని తెలిపారు. కుల మతాలకు అతీతంగా హిందూ ముస్లిం యువకులు ఐక్య మత్యంతో,సోదర భావంతో 50 మంది ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవత్వాన్ని చాటారు. జన్నైధార బ్లడ్ బ్యాంక్ సిబ్బంది శిబిరానికి హాజరై యువకుల రక్తాన్ని సేకరించి రక్తదానం చేసిన యువకులను జ్యూస్ పండ్లు అందజేసి అభినందించారు. రక్తదాన కార్యక్రమం ఏర్పాటు చేసిన యువకులతో కలిసి మహా టీవీ జర్నలిస్ట్ రిజ్వాన్ మాట్లాడుతూ.. మతాలు వేరైనా మానవత్వం ఒక్కటేనని అన్నారు.హిందూ ముస్లిం యువత ఐక్య మత్యంతో రక్తదానం చేసి మానవత్వాన్ని చాటడం ఎంతో అభినందనీయ మని అన్నారు ఈ రక్తదాన కార్యక్రమం ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచిందని అన్నారు. యువత ఇదే మాదిరిగా మరెన్నో సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకొని ఎందుకు రావాలని సూచించి,ఐక్యమత్యం తో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమం లో జన్నైధార బ్లడ్ బ్యాంక్ సిబ్బంది,




ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి సిబ్బంది, డాక్టర్లు,యువకులు, రక్తదాన శిబిరం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.